నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా

అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్యలున్నా ప్రజలు నిర భ్యంతరంగా తనను సంప్రదించవచ్చునని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ ఓసిటీలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న మంత్రి సురేఖ సాధ్యమైనంత వరకు సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అప్పటికప్పుడే సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొన్నటి వరకు ఎలక్షన్ కోడ్ కారణంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పటి నుండి ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గురువారం మంత్రి సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తుండడంతో ప్రజలు క్యాంప్ ఆఫీస్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుదీర్ఘ కాలంగా వేచి చూస్తున్న తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు.





బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి

నవతెలంగాణ-వరంగల్

బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదనవు కలెక్టర్ జీ. సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. రానున్న బక్రీద్ నేపథ్యంలో ముస్లిం మత పెద్దలు, మున్సిపల్, పంచాయతీ, పోలీస్ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమన్వయ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మసీదులు, ఈద్గా, కబ్రిస్తాలో శానిటైజేషన్ మౌలిక వసతుల కల్పనతో పాటు తగినంత లైటింగ్, పటిష్ట పారి శుధ్యం చేయాలన్నారు.వెటర్నరీ అధికారులు ధ్రువీ కరరించిన జంతువులను మాత్రమే వినియోగించాలన్నారు. పండుగ కోసం వాహనాల్లో తరలించే జంతువులకు అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే పోస్టులపై నిర్ధారణ చేసుకోవాలని, ఎవరూ తొందరపడవద్దని అధికారులకు సూచించారు. కబేలాల నిర్వాహకులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పండుగ ముగిసే వరకు మున్సిపల్, పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సౌజన్య, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకష్ణ, ఆర్డీఓ సిదం దత్తు, ఎమ్మార్ఓ ఇక్బాల్, మైనార్టీ మత పెద్దలు దర్శన్‌సింగ్, ఫుర్ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



బడి ఈడు పిల్లలందరిని బడికి పంపాలి

- 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్

నవతెలంగాణ-కాశిబుగ్గ

బడి ఈడు పిల్లలందరినీ బడికి పంపించి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ తూర్పు కోట సంఘం బడి అభివద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజుతో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మంజూరైన రూ.3లక్షల 30వేల నిధులతో పాఠశాలలో ఐరన్ డోర్స్, ప్రహరీ గోడ, వాటర్ సప్లై బాత్రూం హ్యాండ్ వాష్‌సింక్ వాటర్‌సంపు కరెంటు తదితర పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత బుక్స్, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ, స్థానికులు విజయ్ అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు దుస్తులు పుస్తకాల పంపిణీ చేసిన ఘనత ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందని మండల మైనార్టీ సెల్ నాయకులు ఎస్కే అక్బర్‌పాషా అన్నారు. మండల కేంద్రం లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోతుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అల్పాహారం, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఘనత ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వానిదే అన్నారు. కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు దళితసంఘాల ముసుగులో ప్రజాపాలనపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.

ప్రజా పాలన సేవా కేంద్రం ప్రారంభం


నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం చేసినట్లు ఎంపీడీఓ శంకర్ ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. రేషన్ కార్డు ఉండి '0' కరెంట్ బిల్లు రాని వారు 500గ్యాస్ సబ్సిడీ రాని వారు గురువారం నుండి సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన రసీదు,రేషన్ కార్డు,కరెంటు బిల్లు,గ్యాస్ పట్టా పుస్తకం.రిజిస్టర్ చేసిన ఫోన్ నెంబర్‌తో రావాలని ఎంపీడీఓ తెలిపారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్

నవతెలంగాణ-కాశిబుగ్గ



దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) నిర్వహించిన పరీక్ష ఫలితాలపై అనేక అను మానాలు ఉన్నందున పరీక్ష నిర్వ హించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని అఖిలభారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్‌ఎఫ్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలపై సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శివనగర్ అండర్ బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ మే 5న జరిగిన నీట్ పరీక్షకు దేశవ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. నీట్ ఫలితాలలో అనేక అవకతవకాలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని శరత్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు శివ, అభిరామ్, రాజు, సంతోష్, రమేష్, ప్రభాస్,, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి దందా.. వాల్టా చట్టానికి తూట్లు

- భారీ యంత్రాలతో మట్టి అక్రమంగా తరలింపు

- నిద్రావస్థలో సంబంధిత అధికారులు

- లారీల రాకపోకలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-రాయపర్తి

అసైన్డ్ భూములు రోజురోజుకూ అక్రమార్కుల చేతిలో తరిగిపోతున్నాయి. ప్రకతి సంపదను కాపాడాల్సిన అధికార యంత్రాంగం అటువైపు కన్నెతి చూడకపోవడం మట్టి వ్యాపారులకు వరంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తిర్మాలాయపల్లి-గన్నారం గ్రామాల మధ్యలోని సర్వే నెంబర్ 369, 370, 371, 373లో 43 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో రోజూ రాత్రినక, పగలనక మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున దందా కొనసాగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యహరించడం సరికాదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు మట్టిని కొల్లగొట్టి రైస్‌మిల్లు నిర్మాణాలకు మట్టిని అమ్ముకుంటున్నారు. వాల్టా చట్ట ప్రకారం మట్టి తవ్వకానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. ఇందుకోసం రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రైతుల పట్టా భూముల నుంచి మట్టిని తీసిన కూడా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ మట్టి వ్యాపారులు నిబంధనలను గాలికొదిలి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా శాఖలకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. అక్రమార్కులకు కొందరు ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో మట్టిని దర్జాగా తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి అక్రమ తవ్వకాలు కండ్లముందే జరుగుతున్నా అధికారులు కట్టడి చేయకపోవడం శోచనీయం.



ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో మట్టి దందా..

గత ప్రభుత్వం హయాంలో తిరుమలాయపల్లి-గన్నారం మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సన్నాహాలు చేసింది. గతేడాది ఫిబ్రవరి 4న అప్పటి వరంగల్ ఆర్డీవో మహేందర్ జీ, తహశీల్దార్ సత్యనారాయణ ఈ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. 43ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మించి మిగిలిన స్థలంలో ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్, మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.అయితే కాలక్రమేనా ప్రభుత్వాలు మారడంతో ఫ్యాక్టరీ నిర్మాణ విషయం కనుమరుగయింది. ఇదే అదునుగా భావించిన కొందరు ఆ భూమిలో మట్టి తీసి అమ్ముకుంటూ పబ్బం గడుపుతున్నారు. తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన పలువురు ఈ భూమి తమదేనంటూ రూ.6లక్షల50వేలకు బేరం కుదుర్చుకొని మట్టిని రైస్‌మిల్ నిర్మాణానికి అమ్ముకుంటున్నారు.

లారీలతో.. గన్నారం ప్రజల ఇక్కట్లు

భారీ ఇటాచీ యంత్రంతో మట్టిని తీస్తుండటంతో భూమి మొత్తం గుంతలమయమవుతుంది. ఇదే కాకుండా మట్టిని తరలించేందుకు భారీ లారీలు వాటడంతో గన్నారం గ్రామస్తులు భారీ యంత్రాల శబ్దాలకు భయాందోళనకు గురవుతున్నారు. గన్నారం నుండి కొండూరు దుర్గమ్మ గుడి ప్రక్కన రోడ్డు గుండా రాయపర్తి రామచంద్రుని చెరువు వరకు డ్రైవర్లు లారీలను సినిమారేంజ్‌లో నడుపుతున్నారు. 12 ఫీట్ల బీటి రోడ్డుపై ఈ భారీ లారీలు వెళ్లడంతో ఎదురుగా వచ్చే వాహనాలు రోడ్డు పక్కనే ఉండే ముళ్లపదల్లోకి వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు నిత్యం నడవడంతో బీటీ రోడ్డు ధ్వంసం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భారీ వాహనాల నుండి తమను రక్షించాలని కోరుతున్నారు.

అసైన్డ్ భూమిలో మట్టి తీస్తే చర్యలు తీసుకుంటాం

శ్రీనివాస్ (రాయపర్తి తహశీల్దార్)

ఎలాంటి అనుమతులు లేకుండా అసైన్డ్ భూముల్లో మట్టి తీస్తే శాఖ బరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. తిరుమలాయపల్లి గన్నారం మధ్యలో ఉన్న అసైన్డ్ భూమిలో గతంలో ఆయిల్ ఫామ్ మిల్లు నిర్మాణానికి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు గతంలో ఉన్న అధికారులు అనుమతులు ఇవ్వడం జరిగింది. అదే భూమిలో మట్టి తీస్తున్న వారి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటాం.

ఆశా వర్కర్ల పరీక్షను ఉపసంహరించుకోవాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అధ్యక్షతన ధర్నా చేపట్టారు. అనంతరం ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా సీఐటీ యూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి హాజరై మాట్లాడుతూ ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో 33ఏండ్ల నుండి మైదాన ప్రాంతంలో జిల్లాలో 13ఏండ్ల నుండి పని చేస్తున్నారు. ప్రారంభం నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణలు పొందారు. రిజిస్టర్ రాయడం, సర్వేలు చేయడం ఆన్‌లైన్ పని చేయడం ద్వారా వర్కర్స్ కు బీపీ, షుగర్, థైరాడు తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందిస్తు తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు వివరిస్తున్నారని అన్నారు. వీటితో పాటు గర్భిణీ బాలింతలు చిన్న పిల్లలకు ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. కరోనా మహ్మమ్మారి కాలంలో కరోనాకు భయపడకుండా నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారన్నారని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని, ఆశ వర్కర్లకు అవార్డు కూడా ప్రకటించారని తెలిపారు.

గతంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఇదే నిర్ణయాన్ని ముందుకు తెచ్చి, అమలు చేయాలని చూసింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆశాలు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వం ఈ విధానాన్ని వెనక్కి తగ్గిందన్నారు. ఇప్పటికైనా ఆశా వర్కర్ల పరీక్షను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2023 జూన్ 5న జరిగిన ఆశాల టెలి కాన్ఫరెన్స్ సమావేశంలో మాజీ హెల్త్ మినిస్టర్ హరీష్‌రావు ఆశా కార్యకర్తల పరీక్షలను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అనేక హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు మళ్లీ కొత్తగా సమస్యలు తేవడం అన్యాయం అన్నారు. ఇప్పటికే సర్వీస్ లో ఉండి సీనియర్లుగా ఉంటూ సేవలందిస్తున్న ఆశా వర్కర్ల కు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అందజేయాలి.అనేక సంవత్సరాల నుండి కనీస వేతనాలు అమలు కాక దుర్భరమైన జీవితాలు గడుపుతున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని ఈఎస్ఐ, పిఎఫ్,తదితర సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్ష ణమే ఉపసంహరించుకోవాలని అసెంబ్లీ ఎన్నికల ముందు ఆశల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న మని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ఇన్సూరెన్స్ రూ. 50లక్షలు ఇవ్వాలని, మట్టి ఖర్చులు రూ. 50 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ 5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసారు. తక్ష ణమే ప్రభుత్వం తీసుకున్న ఎగ్జామ్స్ వెంటనే ఉప సంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో రాణి, ఉషారాణి, సుజాత, మాధవి, లత, రమ, పద్మ మాధవి, రమాదేవి, మరియా, రజిత, ఆయుష, రాజేశ్వరి, కారుణ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అక్రమ మొరం దందాపై..

అధికారుల చర్యలు శూన్యం

- కాంట్రాక్టర్‌కే ఇరిగేషన్ అధికారుల వత్తాసు

- భారీగా ఇరిగేషన్, రెవెన్యూకు గండి

- తూతూ మంత్రంగా తనిఖీలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్లు పెద్ద చెరువు, సాకరి బోర్లు (గుట్ట) వద్ద 15రోజులుగా మొరం అక్రమ దందా జోరుగా కొనసాగుతుంది. అయితే ఇంత తతంగా నడుస్తున్నా పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. రెండు పెద్ద హిటాచీలు, ట్రాక్టర్లు, టిప్పర్లలో బహిరంగంగా మొరం అక్రమ రవాణా చేస్తుండటం నిజమే అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు, అక్రమ మట్టి వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నారు. చాలా రోజులుగా చెరువు నుంచి మట్టి తీయడంతో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ రెవెన్యూకు భారీగా గండి పడిందని, ఇంత జరిగిన డీఈ స్థాయి అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించకుండా కేవలం వర్క్ ఇన్స్పెక్టర్ పంపించి తూతూ మంత్రంగా ఎంక్వయిరీ నిర్వహించడం పలు అనుమానాలకు దారితీస్తుంది.



అయితే సంబంధిత కింది స్థాయి ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్, మట్టి అక్రమ వ్యాపారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఐబీ డీఈ రాజును వివరణ కోరగా... ప్రస్తుతం పీఆర్ నుంచి పర్మిషన్ తీసుకుంటారట...! అప్పుడే మట్టి తరలించుకోమని చెప్పినట్లు తెలిపారు. 15 రోజుల నుంచి తీసిన మొరంకు సంబంధించి క్యూబిక్ మీటర్ల చొప్పున కొలతలు వేసి సంబంధిత కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తామని ఆయన వివరించారు.

వాహన మరమ్మత్తు పనుల్లో వేగం పెంచాలి

నగర మేయర్ గుండు సుధారాణి

నవతెలంగాణ-వరంగల్

వాహన మరమ్మత్తు పనుల్లో వేగం పెంచాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. హనుమకొండలోని బాలసముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న వాహన షెడ్డును గురువారం మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాలకు కొనసాగుతున్న మరమ్మత్తుల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మత్తుల కోసం షెడ్డుకు వచ్చే వాహనాలను జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు వెంటనే మరమ్మ త్తులు పూర్తి చేసి పంపించాలని అన్నారు. మరమత్తుల కోసం వాహన షెడ్డులోకి వచ్చే వాహనాల మరమత్తులు నమోదు రిజిస్టర్‌ను మేయర్ పరిశీలించి నిర్వహణ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ వల్ల 44 వాహనాల మరమ్మత్తులో కొంత జాప్యం జరిగిందని ప్రస్తుతం కొనసాగుతున్నాయని అధికారులు మేయర్‌కు వివరించగా, వాహనాల లేమి వల్ల శానిటేషన్‌పై ప్రభావం ఉంటుందని తెలిపారు. త్వరితంగా రిపేరింగ్ లు పూర్తి చేయాలని మేయర్ ఆదేశించారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా వాహన షెడ్డులో ఏర్పాటు చేయనున్న సెకండ్ ట్రాన్సుర్ స్టేషన్ పనులు ఇప్పటికే పూర్తి అయినప్పటికీ అంతర్గతంగా సిసి రోడ్ల నిర్మాణ పనులు ఎలక్షన్ కోడ్ మూలంగా పెండింగ్ లో ఉన్నందున వెంటనే పూర్తి చేసి ట్రాన్సుర్ స్టేషన్ ను పనిచేయు స్థితి లోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సంజయ్ కుమార్, డిఈ సంతోష్ బాబు, ఏఈలు పాల్గొన్నారు.



పట్టుకున్న వారిని 24 గంటల్లో కోర్టులో హాజరుపర్చాలి

నవతెలంగాణ-వెంకటాపురం

తడపల అటవీ ప్రాంతంలో ఈ నెల 12న గ్రేహౌండ్స్ పోలీసులు పట్టుకున్న ముగ్గురు మావోయిస్టు సభ్యులు రీతా, మోతీ, ఇడ్మాలతో పాట మరో ముగ్గురిని 24గంటలలో కోర్టులో హాజరు పర్చాలని వెంకటాపురం, వాజేడు మావోయిస్టు ఏరియా కమిటి కార్యదరి శాంత పేరున సోషల్ మీడియాలో మావోయిస్టుల లేఖ వైరల్ అవుతుంది. పట్టుకున్న వారిని ఎన్ కౌంటర్ పేరుతో చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఎలాంటి సంబంధం లేని అమాయకులను బాంబుల గురించి చెప్పాలంటూ చిత్ర హింసలకు గురి చేస్తున్నారని పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులను ఖండించాలని లేఖలో పేర్కొన్నారు.



ఇసుక లారీలు నిలిపేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నవతెలంగాణ-మంగపేట

ప్రయాణాల్లో ప్రమాదాలకు కారణం అవుతున్న ఇసుక లారీలను పాఠశాలలు పునర్ ప్రారంభమైన వేళ నడవకుండా నిలిపివేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాగటి రవి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రాజుపేట గ్రామంలో విద్యారంగ సమస్యలపై ఎస్ ఎఫ్ ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం బాలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాగటి రవిహాజరై మాట్లాడారు. మండలంలోఇసుక ర్యాంపులు విపరీతంగా వుండటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే కొంతమంది ఇసుక లారీల వలన రోడ్డు ప్రమాదాలకు గురై మరణించారని తెలిపాడు. ఇసుక లారీలు రోడ్డుపై బారులు తీరి ఉండడం వలన రహదారిపై వచ్చి పోయే వాహనాలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆ సమయంలో ప్రమాదాలు జరగడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. రోడ్డుపైన వెళుతున్న వాహనదారుల కళ్ళలో ఇసుకపడి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. పాఠశాలలో ప్రారంభమైన వేల ఉదయం సాయంత్రం వేళల్లో ఆటోలు బస్సులు వంటి వాహనాల్లో పిల్లలు పలు గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లి వస్తారని ఇసుక లారీల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పాఠశాల సమయంలో లారీలు నడవకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు అంత ఏకమై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు స్వామి, బైరెష్ పాల్గొన్నారు.



జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ మారుతి ఆర్థికసాయం

నవతెలంగాణ-మహదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా: మొగుళ్ళపల్లి మండలం: ఇస్పేట్ గ్రామానికి చెందిన గుడిపాక దశరథం ఇటీవల ప్రమాద వశాత్తు హార్ట్ ఎటాక్ తో మరణించతో వారి కుటుంబ పరిస్థితి చాలా దయనీయంగా మారింది కనీసం తినడానికి తిండి ఉండడానికి ఇల్లు లేని పరిస్థితి వారిది విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి గురువారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 ఆర్థిక సాయం చేసి ఒక రైస్ బ్యాగ్ నిత్యవసర సరుకులు ఇవ్వడం జరిగింది అలాగే వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషన్న, మొగుళ్ళపల్లి ఫౌండేషన్ మండల అధ్యక్షులు నేర్పటి అశోక్, యూత్ ఇంచార్జ్ చింతకింది రాజు, పిడుగు ఓదెలు, నేరపాటి స్వామి మరియు తదితర సభ్యులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : డీఆర్వో గణేష్

నవతెలంగాణ-సుబేదారి

జూన్ 16న ఆదివారం జరగనున్న యు.పి.ఎస్సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు అన్నిఏర్పాట్లు చేసినట్లు హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్ తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన యుపిఎస్సి పరీక్ష సమన్వయ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ పరీక్ష ఉదయం 9:30 గంటలకు ప్రారంభం ఆవుతుందని అభ్యర్థులను 9 గంటల నుండి పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని 9:30 గంటలకు ప్రారంభమై 11:30 గంటల వరకు జరుగుతుందని అలాగే మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం4:30 గంటల వరకు జరుగుతుందని అభ్యర్థులను 2గంటల నుండి అనుమతిస్తారని తెలిపారు. పరీక్షకు వచ్చిన అభ్యర్థులు హాల్‌టికెట్‌లో ఉన్న పరీక్షా కేంద్రానికి వెళ్లాలని హాల్‌టికెట్‌లో ఉన్న నియమ నిబంధనలు తప్ప కుండా పాటించాలన్నారు. పరీక్ష హాలు లోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్



వాచ్ , క్యాలిక్యులేటర్ లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రం గేటు వద్ద ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ముగ్గురు మేల్ కానిస్టేబుల్ తనిఖీ కోసం నియమించామని మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించబడి ఉంటుందని ఆ కేంద్ర పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయబడి ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఉంటాయని , పరీక్షా కేంద్రాలకు ఎలాంటి అవంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కొరకు టీజీఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో ఈ పరీక్ష కొరకు 11కేంద్రాల్లో 4730 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ అబ్జర్వర్ హరి హర్‌రథ్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు , కాజీపేట డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవీందర్ , ఆర్టీసీ డిఎం ధరంసింగ్ నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు విశ్వసిస్తేనే రాజకీయ భవిష్యత్తు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



నవతెలంగాణ-పరకాల

మన నమ్మకాన్ని ప్రజలు విశ్వసించినప్పుడే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక లలిత ఫంక్షన్ హాల్‌లో వరంగల్ పార్లమెంటరీ సభ్యులు డాక్టర్ కడియం కావ్యకు అభినందన సభ ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వరంగల్ కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరగగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రజల నమ్మకాన్ని విశ్వసించేలా కార్య కర్తలు కష్టపడి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అన్నారు. స్వార్థం చేయలేని రాజకీయనాయకులు లేరని, స్వార్థ రాజకీయాలతో భవిష్యత్తు ఉండదని, కుట్ర రాజకీయాలు చేస్తే సహించబోమని అన్నారు .పార్టీ విధేయతకు కష్టపడిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని పార్టీలో ఎవరైతే చేరుతారో వారి ప్రాధాన్యత ఎలా ఉంటుందో మేము నిర్ణయించడం జరుగుతుందన్నారు. క్యాడర్ కలిగిన వ్యక్తి లీడర్ అవుతారన్నారు. గ్రూపు రాజకీయాలు చేసే వ్యక్తులను సహించబోనని, పార్టీ విజయ విధేయతకు ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందే అన్నారు. లీడర్ నష్టపోయిన కార్యకర్తలు ఎప్పుడూ నష్టపోవద్దని అందరిసమక్షంలోనే సమస్యల పరిష్కరించుకోవాలి తప్ప చిల్లర రాజకీయాలు చేయవద్దు అన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రణాళిక బద్ధంగా నాయకులను ప్రతి గ్రామంలో గ్రామస్తుల సహకారంతోనే ఎంపిక చేయడం జరుగుతుందని పైరవీలను ఎవరు నాముందుకు తీసుకురావద్దన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి 91శాతం ప్రణాళికలతో రూపకల్పన చేసుకుని విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేసినప్పుడే బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. పదవులు అనేటివి కష్టపడిన వారికే దక్కుతుందన్నారు. నియోజకవర్గ విస్తృత సమావేశంలో ప్రతి మండల గ్రామ నాయకులు కాంగ్రెస్ పార్టీని రాబోవు రోజుల్లో గెలిపించుకుంటే మరింత అభివద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ నా గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌ను అభివృద్ధి చేసేలా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని, మరి పరకాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో ప్రత్యేక చొరవ తీసుకుంటానని అన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్యను గజమాలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగురి బిక్షపతి, నాయకులు కొయ్యడ శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, దేవేందర్ గౌడ్, మల్లారెడ్డి తో పాటు జెడ్పిటిసిలు ,ఎంపీపీలు ,ఆయా గ్రామాల, మండలాల నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన వైద్యాధికారులు



నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ రెడ్డి, సిహెచ్ఓ మాధవరెడ్డిలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ హాస్పిటల్‌లో రోగుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలను డాక్టర్ స్పందనను అడిగి తెలుసుకుని ఆసుపత్రి సిబ్బందికి తగు సూచనలు చేశారు. గర్భిణీ స్త్రీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులను పెంచుట గూర్చి, మెటర్నల్ మోటిలిటీ గురించి, ఆరోగ్య మహిళా సేవల గురించి, టి హబ్‌లో జరిగే ప్రతిరోజు టెస్టుల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మహిళా సేవలు అన్ని గ్రామాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఎఎన్ఎం లు పేషెంట్స్‌ను ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పంపించాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బంది తీసుకుంటున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-గూడూరు



కేంద్ర మంత్రులుగా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కిషన్ రెడ్డి బండి సంజయ్ లను రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు లింగాల సుధీర్ రెడ్డిలు ఢిల్లీలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ , మదినాపురం బిజెపి నాయకులు రాజు లు పాల్గొన్నారు.

వేలంలో రూ.10.44 లక్షల ఆదాయం

నవతెలంగాణ-గూడూరు



గూడూర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలో పట్టుపడిన వాహనాలకు వేలంపాట నిర్వహించగా రూ.10.45 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ బిక్షపతి తెలిపారు. గురువారం గూడూరు ఎక్సైజ్ కార్యాలయంలో మహబూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధి కారి, బి కిరణ్ ఆధ్వర్యంలో 29 వాహనాలకు బహిరంగ వేలంలో వేయగా వాహనాలకు రూ.8,88,000లు, జీఎస్‌టీ రూపంలో రూ.1,56,000లు మొత్తంరూ.10,44,000లు ప్రభుత్వానికిఆదాయం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ బహిరంగ వేలం కార్యక్రమంలో గూడూరు, నర్సంపేట, భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండకి చెందిన సుమారు 120 మంది బహిరంగ వేలంకు హాజరుకాగా ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేశ్వరి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధం

- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ 2024 ప్రారంభం





నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్-2024 ప్రారంభం సందర్భంగా నిర్వహించిన 3కే రన్ కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం 7 గంటలకు క్లబ్ ఆవరణ నుండి ఆర్ట్స్ కాలేజ్ వరకు నిర్వహించిన 3 కే రన్ ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, ట్రెజరర్ అమర్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. క్లబ్ నుండి ప్రారంభమైన 3 కే రన్ ఆర్ట్స్ కళాశాలకు చేరుకుంది. అనంతరం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను అతిథులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నిత్యం కాలంతో పోటీపడుతూ పనిచేసే జర్నలిస్టులకు క్రీడలు ఒక ఆటవిడుపని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ జర్నలిస్టులను తమ ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుందన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. క్రీడలకు తన ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ తాను మేయర్ గా ఉన్నపుడు జర్నలిస్టులకు శాయశక్తులా పనిచేశానని, జర్నలిస్టులు తమ ఆరోగ్యాల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ క్రీడల నిర్వహణకు క్లబ్ కమిటీ విస్తత ఏర్పాట్లు చేసిందని క్రీడా పటాలను జర్నలిస్టులు వినియోగించుకోవాలని కోరారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎంఎల్ఏ నాగరాజులు చొరవ తీసుకుని ప్రభుత్వం నుండి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరడంతో వారు అందుకు సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారాపు సదయ్య, కోశాధికారి అమర్, టీయూడబ్ల్యూజే ఐజేయు హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, టి యు డబ్ల్యూ జే హెచ్ 143 వరంగల్ జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ కక్కెర్ల అనిల్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం, బొడిగె శ్రీను, కొడిపెల్లి దుర్గాప్రసాద్, అల్లం రాజేశ్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, వలిశెట్టి సుధాకర్, బూర్ల నరేందర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ నెంబర్లు వీరగోని హరీష్, దొమ్మాటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, యండీ నయీంపాషా, కమటం వేణుగోపాల్, గుండెబోయిన దిలీప్, కందుకూరి సంజీవ్, నన్నపునేని భరత్, మంచాల రాజు, బాలవారి విజయ్, పలువురు సీనియర్ జర్నలిస్టులు హాజరయ్యారు.

ఆగస్టు 15 లోపు రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ

- పాఠశాలలను దేవాలయాలుగా తీర్చిదిద్దుతాం
- త్వరలో రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం
- పాలకుడిలా కాకుండా సేవకుడిలా పనిచేస్తా
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-శాయంపేట

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలులో భాగంగా ఆగస్టు 15లోపు రూ.35 వేల కోట్లతో 2 లక్షల రుణమాఫీని రైతులందరికీవర్తింప చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం తహశీల్దార్ సుభాషిణి అధ్యక్షతన నిర్వహించిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ పాల్గొని 114 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 16 నుండి ఈనెల 9 వరకు ఎన్నికల కోడ్ ఉండడంతో సంక్షేమ పథకాలు నిలిచిపోయినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఏడు లక్షల కోట్లు అప్పులు చేయగా, రూ.27 కోట్ల మిత్తి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులకు రూ. 270 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాలను అభివృద్ధి చేశామని, పాఠశాలలను దేవాలయాలుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, విద్యార్థులు నమోదుశాతం పెంచేలా చూడాలన్నారు. ఏడాదిలోపు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. కళ్యాణ లక్ష్మీ పథకం నిరుపేదలకు వరమని, అతి త్వరలో కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రేషన్‌షాపుల ద్వారా దొడ్డు బియ్యాన్ని సరఫరా చేయడంతో లబ్ధిదారులు బియ్యం తీసుకోకుండా డబ్బులు తీసుకుంటున్నారని, రైతులు సన్న బియ్యం పండిస్తే రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందని వివరించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు కేటాయిస్తామని తెలిపారు. బాంబుల మోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మూడుక్రషర్లను సీజ్ చేయించానని, ఎట్టి పరిస్థితుల్లోనూ రీఓపెన్‌కావని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని పేర్కొన్నారు. పెద్దకొడపాక రెవెన్యూ శివారులోని ప్రభుత్వ భూమిలోగుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇండ్లస్థలాలు, ఇండ్లు కేటాయిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీఓ రంజిత్ కుమార్, ఎంఆర్ఐ శరత్ కుమార్, ఏఆర్ఐ హుస్సేన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, నాయకులు మారపల్లి రవీందర్, చిందం రవి, చింతలరవిపాల్, కుమారస్వామి, కొమురయ్య, కట్టయ్య రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

- హమాలీల సమావేశంలో దాస్యం వినయ్‌భాస్కర్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హమాలీ సంఘం సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా దాస్యం హాజరై మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్నా? లేకున్నా ? సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమంగా ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని అన్నారు. కార్మికుల అభివృద్ధి కోసం అనేక సంఘాలతో నిరంతరం మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నానని, మీ సమస్యలకు కూడా పరిష్కరించే దిశగా పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. కార్మికుల కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో హనుమకొండ జిల్లాలో సుమారు రూ.6 కోట్లు విలువచేసే భూమిని కార్మిక సంఘం భవన నిర్మాణం కోసం కేటాయించామని తెలిపారు. గతంలో కార్మికుల కోసం మే మాస ఉత్సవాలను 30 రోజులు నిర్వహించామని ఈ సంవత్సరం ఎలక్షన్ కోడ్ ఉన్నందువల్ల మూడు రోజులు మాత్రమే తెలిపారు. గతంలో నిర్వహించిన మే మాసోత్సవం కార్యక్రమాలను గురించి కెసిఆర్ అడిగి తెలుసుకున్నారని, అది విన్నప్పటినుండి కార్మికుల కోసం వారి అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాల రూపొందించారని అందులో భాగంగా 33 జిల్లాలలో కార్మిక భవన నిర్మాణల కోసం భూమిని కేటాయించడం జరిగిందన్నారు.

కార్మికుల కోసం ఉచిత హెల్త్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు, వారి పిల్లల చదువుల కోసం ఆర్థిక అవసరాలు తీర్చడానికి ఎంతగానో ఈ సంఘాలు ఉపయోగపడతాయని, వారికి తనవంతుగా చేయూతను అందిస్తానన్నారు. ఆటో కార్మికులు, తాపీ మేస్త్రి కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు,పేపర్ బాయ్స్,షాప్ లో పనిచేసేటువంటి కార్మికులు, హోటల్స్‌లో పనిచేసేటువంటి కార్మికులు ఇలా అనేక సంఘాలతో మమేకమై పనిచేస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం తోడ్పడుతున్నానని అన్నారు.

ఏ ఇబ్బందుల్లో ఉన్న మీకు అండగా ఉండి, మీలో ఒక కుటుంబ సభ్యుడిగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు. మీ సమస్యలను కూడా ఓనర్స్ దృష్టికి తీసుకువెళ్లి హమాలీల కూలీల రేట్లు పెంచేందుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఏంజాల మల్లేశం,మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఈసంపల్లి సంజీవ్, ట్రేడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాదరబోయిన కొమురయ్య, ఉపాధ్యక్షులు గోంగళ్ల వెంకన్న, కార్యదర్శి సన్నబోయిన రవి,కార్య వర్గ సభ్యులు మల్లేష్, రామ్మూర్తి, కుమారస్వామి, రాములు, కొండయ్య, యాకయ్య, అంజయ్య, రాజు,దేవేందర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని నిరసన

నవతెలంగాణ-మరిపెడ

మండలంలోని తాళ్ళ ఊకల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ (ఇండస్ కంపెనీ) పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం వారు మట్లాడుతూ గ్రామంలో సెల్ టవర్ నిర్మాణంతో రేడియేషన్ పెరిగి గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతారని వారు ఆందోళన



వ్యక్తం చేశారు. ఈ నిరసనలో బత్తుల శ్రీను , సీమ సురేష్, జటంగి మల్లయ్య, గంధసిరి నాగేష్, తప్పెట్ల లింగన్న, కోడి కంటి సతీష్, సమ్మెట వెంకన్న, పుల్లూరు వీరబాబు, తప్పెట్ల రమేష్, కోడి కంటి దామోదర్, భూక్య శ్రీను తదితరులు ఉన్నారు.

కేయూ ఫిజిక్స్ హెచ్‌ఓడీగా మంజుల

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



కాకతీయ విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగ నూతన అధిపతిగా డాక్టర్ జి. మంజుల బాధ్యతలు స్వీకరించారు. కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి. మంజుల 2010లో సహాయ ఆచార్యులు గా ప్రవేశించారు. యూనివర్సిటీ ఆర్ట్స్అండ్‌సైన్స్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా, 2019-2021 సంవత్సరాలలో భౌతిక శాస్త్ర విభాగపాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా పని చేసారు, 22 కి పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు, ఉత్తమ ఎన్‌సిసి ఆఫీసర్‌గా అంతర్జాతీయ ఉత్తమ పరిశోధన పత్ర అవార్డు లు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజులను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

కన్నుల పండుగగా శివపార్వతుల కళ్యాణం

నవతెలంగాణ-శాయంపేట



మండలంలోని మైలారం గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏడో వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు గూడ వెంకట్రాంనరసయ్య ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, హెూమము నిర్వహించారు. ముందుగా గ్రామ దేవతలకు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. యాగ్నికులు వేద మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండుగగా శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మిరెడ్డి కొమరారెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారుడు ఎన్నారై రాజు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీ డాక్టర్ కావ్యకు సన్మానం

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



నూతనంగా ఎన్నికైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలను 47వ డివిజన్ నాయకులు సందెల విజయ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేటలో నెలకొన్న సమస్యల గురించి ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నాయకులు మద్దెల శోభారాణి, ఇమ్మడి బాబు, కాసర్ల నగేష్, సత్యవరం మధుకర్, గంగుల రాజిరెడ్డి, సురేందర్, అర్చన, ప్రగతి, దేవర రమేష్, చింటూ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్వయంకృషి వృద్ధాశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

స్వయంకృషి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఇల్లంద జెడ్పీహెచ్ఎస్ 1995-96 ఎస్ఎస్సి బ్యాచ్ స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ములుగు రోడ్ లోని స్వయంకృషి వద్ధాశ్రమంలో నిర్వహించారు. అసోసియేషన్ సభ్యుడైన నూక శ్రీధర్ బీటెక్ చదువుతున్న తన కూతురు తనుజ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పోశాల శ్రీనివాస్, నూక శ్రీధర్, సట్ల రమేష్, మంజుల, రజిత, భవ్యలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కీర్తిరెడ్డి

నవతెలంగాణ-శాయంపేట



ఢిల్లీలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన గంగాపురం కిషన్ రెడ్డిని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్‌లను బుధవారం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి మెమోంటోతో అభినందనలు తెలియజేశారు.

గోవులను తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి గోవులను స్వాధీన పరుచుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు డివిజన్ పరిధిలోని పాలకేంద్రం వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ నందు డీసీఎంపై నల్లటి ప్లాస్టిక్ పరదాలు కప్పుకొని అనుమానాస్పదంగా వెళ్తున్న డీసీఎం ఆపి తనిఖీ చేయగా 30 పశువులు అం దులో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. పశువులను అక్రమంగా భద్రాచలం అవుతల ఆంధ్ర ప్రదేశ్ నుంచి హైదరాబాదుకు ఎలాంటి అనుమతులు లేకుండా జాగ్రత్తలు పాటించకుండా తరలిస్తున్న పశువులను స్వాధీన పరచుకుని హైదరాబాద్ చెందిన ఎండి.రెహమాన్, నజర్‌ఖాన్, అమాయుద్దీన్, సయ్యద్‌లపై కేసు నమోదు చేసి డీసీఎంను స్వాధీనపరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈనెల 18న ఎన్ఐటీలో ఓపెన్‌హౌస్

నవతెలంగాణ- ఎన్జీవోస్ కాలనీ



నీట్ -2024లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల 18న వరంగల్ ఎన్ఐటీలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. క్యాంపస్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో డైరెక్టర్‌లు, డీన్‌లు, హెచ్ఓడీలు, సీనియర్ ఫాకల్టీతో 'ప్రశ్నలు- జవాబులు' అనే కార్యక్రమం ఉంటుందని నూతనంగా ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఆయిల్ ఫామ్ పంట సాగుతో ప్రయోజనం

నర్సరీని పరిశీలించిన అదన కలెక్టర్

నవతెలంగాణ-జనగామ



ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. గురువారం జనగామ మండలంలోని ఎల్లంల గ్రామంలో నిర్వహిస్తున్న ఆయిల్ ఫామ్ నర్సరీని ఉద్యానవన శాఖ జిల్లా అధికారిని కేఆర్ లతతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంల గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీలో 3,30000 ఆయిల్ ఫామ్ మొక్కలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నీటి సౌకర్యం గల రైతులు ఆయిల్ ఫామ్ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ పంట సాగు ద్వారా భవిష్యత్తులో రైతులు అధిక లాభాలు పొందుతారని అన్నారు. ఈ పంట సాగుకు ఆసక్తి గల రైతులు ముందుకు వచ్చి మొక్కలు పొందాలని చెప్పారు.

అంధ ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉత్తర తెలంగాణ జిల్లాలోని అంధ విద్యార్థుల కోసం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ బి.నర్మద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు మీడియంలో బోధించనున్నట్టు తెలిపారు.

ఈ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు భోజన వసతి ఉందని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్‌లో శిక్షణ, వివిధ కళల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కళాశాలలో ప్రవేశం కోసం 6నుంచి 14ఏండ్ల మధ్య వయసు కలిగి ఉండి, జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో 40నుంచి 100శాతం వరకు అంధత్వం కలిగిన బాల బాలికలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9494317315, 9701190124, 7396206959, 9440338424 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.



ప్రతి వ్యక్తికి భవిష్యత్తు బీమా భరోసా అవసరం

అవగాహన సదస్సులో ఆర్బీఐ ఏజీఎం రెహమాన్

నవతెలంగాణ-డెస్క్

ప్రతి వ్యక్తికి భవిష్యత్తు బీమా భరోసా అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం రెహమాన్ అన్నారు. గురువారం నర్మెట మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా గ్రూపులకు ప్రధానమంత్రి సురక్ష బీమా అటల్ పెన్షన్ యోజన ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేజీఎం రెహమాన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి బీమా చేయించుకోవాలని సూచించారు. జీవితంలో ఎప్పుడు ఎలాంటి సంఘటనలు జరుగుతాయో ఊహించలేమన్నారు. మనం చేయించే బీమా మన కుటుంబాలకు ఆధారంగా ఉంటుందన్నారు. వార్షిక ప్రీమియం కేవలం రూ.20 చెల్లించడం ద్వారా రూ.2 లక్షల రూపాయల ప్రమాద బీమా లభిస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద వార్షిక ప్రీమియం కేవలం రూ.436 చెల్లించడం ద్వారా రెండు లక్షల రూపాయల జీవిత బీమా లభిస్తుందన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా తక్కువ పెట్టుబడితో వద్ధాప్యంలో అధిక ప్రయోజనాలు పొందవచ్చు అన్నారు. ఈ బీమా సౌకర్యాల ప్రీమియం చెల్లించేందుకు ప్రతి బ్యాంకులో మేనేజర్‌ను సంప్రదించి ఈ అవకాశాన్ని పొందవచ్చు అని సూచించారు. ఈ పథకాలను గ్రామీణ ప్రాంతంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్, బ్యాంక్ ఆఫ్ భరోడా నర్మెట మేనేజర్ కష్ణ కమల్, సిఎఫ్ఎల్ జనగామ కార్యాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



సూరారంలో మిషన్ భగీరథ ఇంటింటా సర్వే

గ్రామ పంచాయతీ కార్యదర్శి కె శైలజ

నవతెలంగాణ-జఫర్‌గడ్

మండలంలోని సూరారం గ్రామపంచాయతీ పరిధిలోని సురారం, చర్లతండా, నక్కలపల్లిలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లాలపై ఇంటింటి సర్వే చేస్తున్నట్టు సూరారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె శైలజ తెలిపారు. అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటింటికీ తాగునీరు సరఫరా అవుతోందా లేదా అని ఇంటి యజమానులకు క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నామన్నారు. సర్వేలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా, నీళ్లు వస్తున్నాయా, ఎన్ని రోజులకు ఒకసారి వస్తున్నాయనే వివరాలపై సమగ్ర సమాచారం తెలుసుకుంటున్నామని తెలిపారు. తాగునీటి, సరఫరా లేని ఆవాసాలు, ప్రాంతాలు, ఎద్దడి ఉన్న ఇళ్లను గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కారోబార్ ఓరుగంటి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, సీఏ నూనె రజిత, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మెన్ మారపాక రవి

నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మెన్, స్థానిక జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. గురువారం మండలంలోని తాటికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవి బడిబాట ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందించి, ప్రశాంత వాతావరణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌడ రాజేందర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్ కుమార్, పీఈటి రాము, ఉపాధ్యాయులు మురళి, రాజు, శ్రీనివాస్, రంజిత్, సంపత్, అనసూర్య, రుద్ర, రుద్రమ, సంపత్ నాగదేవ్,ఐలోని రవి, ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు, మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, మాజీ ఎస్ఎంసి చైర్మన్లు మారపాక బాబు, మారపాక శ్రీధర్, వివోఏలు అక్కెనపల్లి సరిత, ఉమ్మగొని సుమతి, మారపాక హైమావతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసిన 'చిర్ర'

నవతెలంగాణ-లింగాలఘనపురం



పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లోని అయన కార్యాయలంలో జనగామ జిల్లా తీన్మార్ మల్లన్న టీం నాయకుడు చిర్ర వీరస్వామి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక మల్లన్న పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి మండలిలో అడుగుపెట్టడం శుభప్రదం అని, భవిష్యత్‌లో తీన్మార్ మల్లన్న తెలంగాణ యువత కోసం మరింత కృషి చేయాలన్నారు. మల్లన్న గెలుపునకు సహకరించిన నిరుద్యోగులు, యువత, ప్రైవేట్ టీచర్స్, సబ్బండవర్గాలకు అయన కతజ్ఞతలు తెలిపారు.

ఈదురుగాలుల బీభత్సం

భారీ వర్షంతో పాటు వడగండ్లు

విరిగిన విద్యుత్ స్తంభాలు, లేచిన ఇంటి పైకప్పులు

నవతెలంగాణ-పాలకుర్తి



భారీ వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వడగండ్ల వర్షానికి మండలంలోని శాతాపురం, దుబ్బ తండా ఎస్సీ, తొర్రూరు, లక్ష్మీనారాయణ పురం గ్రామాల్లో అపార నష్టం జరిగింది. ఈదురు గాలులకు ఇండ్ల పైకప్పులు లేచిపోవడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. ఈదురుగాలులు బలంగా వేయడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమన్నారు. ఈదురుగాలులకు తోడు వడగండ్ల వర్షం, ఉరుములు, మెరుపులు ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయి. గురువారం కురిసిన భారీ వర్షానికి రైతులకు అపార నష్టం వాటిల్లింది. వేలాది రూపాయలు వెచ్చించి చేలల్లో పత్తి గింజలను రైతులు విత్తడం తో భారీ వర్షానికి చేలలోనుండి వరద ప్రవాహాలు ఉదతంగా సాగాయి. దీంతో పత్తి విత్తనాలపై వరదతో బీటలు మరడంతో రైతులకు అపార నష్టం వాటిలిందని పలువురు రైతులు తెలిపారు. దుబ్బ తండా ఎస్సీ శివారు కేవుల తండాలో బానోతు జలంధర్ కు చెందిన ఇంటి పైకప్పు ఈదురుగాలులకు లేచిపోవడంతో ఇంట్లో సామాగ్రి వర్షానికి తడిసి ముద్దయిందని విలపించారు. తొర్రూరులో విద్యుత్ స్తంభాలు విరిగాయని గ్రామస్తులు తెలిపారు. మండలంలోని లక్ష్మీనారాయణ పురంలో విసునూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు ఇరుకుగా ఉండడం వల్ల వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. కల్వర్టు వద్ద గండి పడటంతో గ్రామస్తులు మట్టి పోశారు. కల్వర్టు వద్ద ఆర్టీసీ బస్సు దిగబడిందని గ్రామస్తులు తెలిపారు. కల్వర్టు వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని ఇరుకుగా ఉన్న కల్వర్టును తొలగించి పెద్ద కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. విద్యుత్ స్తంభాలు కూలినప్పటికీ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో పలు గ్రామాల్లో ఈదురు గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో అపార నష్టం జరిగిందని ఆయా గ్రామస్తులు తెలిపారు. నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పాలకుర్తి నియోజకవర్గానికి నిధులు కేటాయించాలి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, చెన్నూర్ రిజర్వాయర్లను పూర్తి చేసి

రైతులకు సాగునీరు అందించాలి

ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలను మంజూరు చేయాలి

విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వినతి

నవతెలంగాణ-పాలకుర్తి



పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించి, నియోజక వర్గంలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాదులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీరెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షిని వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు.పాలకుర్తి నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు అధిక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరామని తెలిపారు. నియోజకవర్గంలో పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్ పనులు పూర్తి కాకపోవడంతో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతులు నష్టపోయారని తెలిపారు. పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని సీఎంను కోరడంతో సానుకూలంగా స్పందించారని అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తప్పిదాల వల్ల పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు అనేకమంది నష్టపోయారని, విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాలకుర్తిలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరామని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో విద్య వైద్య రంగాలపై ప్రత్యేక దష్టిని కేటాయించాలని కోరామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేయడమే లక్ష్యంగా దష్టి పెట్టామని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలలను మంజూరు చేశామని, కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ,పీఎంపీ సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంపై ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్యాల వేణు, బిర్రు సోమేశ్వర్ సీఎం రేవంత్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించి, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలని ఆర్ఎంపీ, పీఎంపీల రాష్ట్ర అసోసియేషన్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో గ్రామీణ వైద్యులకు అపార గౌరవం దక్కుతుందన్నారు. గ్రామీణ వైద్యులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీ

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో గురువారం ఎంపీయూపీఎస్ పాఠశాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంలు అందాయా, మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా గుడ్లు, పాలు, నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అధునాతన పద్ధతిలో విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, ఉచిత సౌకర్యాలను అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మౌలిక వసతుల పనులను పర్యవేక్షించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న, మిగిలిన మరమ్మతుల పనులు రెండు రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసి, ఉన్నతమైన విద్యను అందిస్తున్నామని, విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు రావాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, బడి బాటలో భాగంగా బడీడు పిల్లలను, బడి బయట చిన్నారులను బడిలో చేర్చాలని, తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల్లో కల్పించేటటువంటి బోధన పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి కొమురయ్య, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధులపై యాక్షన్ ప్లాన్ రూపొందించు కోవాలని, ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టి అవగాహన పరచాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన జెడ్పి సీఈవో అనిల్ కుమార్‌తో కలిసి గ్రామ పంచాయతీ స్థాయిలో కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించు కోవాలని ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు అంచెలంచలుగా చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. పరిసరాల పారిశుధ్యంపై ఉద్యమ రూపంలో విస్తత ప్రచారం చేపట్టాలని ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని, గ్రామస్థాయి వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికి సమాచారాన్ని అందించాలన్నారు. మలవిసర్జనకు మరుగు దొడ్లనే వినియోగించాలని, ఈగలు, దోమలు పెరగకుండా లార్వా స్థాయిలోనే నిరోధించేందుకు కషి చేయాలన్నారు.ఉరుములు మెరుపుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటికి దూరంగా ఉండటం ఎత్తైన భవనాలకు, చెట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ పరికరాలలో విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయాలన్నారు.

కిరాణ, పాన్‌షాప్‌లపై పోలీసు దాడులు

నిషేధిత గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య

నవతెలంగాణ-పాలకుర్తి



నిషేధిత గుట్కాలను అమ్మితే చర్యలు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌జా ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోనికి రాణా షాపులతో పాటు పాన్ షాపులపై పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి తో కలిసి పోలీస్ దాడులు నిర్వహించారు. కిరాణం పాన్ షాపులలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపి నర్సయ్య మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు యువత జీవితాన్ని నాశనం చేస్తుందని తెలిపారు. నిషేధిత గుట్కాలకు, గంజాయికి యువత బానిస కాకూడదని పిలుపునిచ్చారు. గుట్కా, గంజాయి రహిత సమాజాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. యువత సన్మార్గంలో నడిచినప్పుడు సమాజం బాగుపడుతుందని అన్నారు. నిషేధిత గుట్కాలు అమ్మినట్లు సమాచారం అందితే చర్యలు తీవ్రంగా ఉంటాయని కిరాణం, పాన్ షాపుల నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మోడం సాయి ప్రసన్న కుమార్, లింగారెడ్డి పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం చేసిన

వ్యక్తికి పదేండ్లు జైలు శిక్ష

నవతెలంగాణ-నర్మెట్ట

భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు జనగామ కోర్ట్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సిహెచ్ విక్రమ్ పదేండ్లు జైలు శిక్ష రూ.5వేల జరిమానా విధించారు. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడెంకు చెందిన చందన బత్తుల నర్సయ్యకు గండిరామారం గ్రామానికి చెందిన రజితతో వివాహం జరిగినది. అయితే నర్సయ్య తన భార్యపై అనుమానంతో 2022లో ఆమెను గొడ్డలితో నరకగా నర్సయ్యపై హత్యాయత్నం కేసు నమోదైనది. అయితే బాధితురాలు తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్టీవెన్ శ్రీదేవి వాదించారు. సమయానికి సాక్షులను కోర్టులో హాజరు పరిచిన కానిస్టేబుల్ కరుణాకర్‌ను అభినందించినారు.



బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-కొడకండ్ల

మండల కేంద్రానికి చెందిన భావంతి రాములు మూడ్రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి గౌడ సంఘం నాయకులు గురువారం రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఆకయం మాట్లాడుతూ భావంతి రాములు దళితుడు. కాగా గౌడ కులస్తులతో కలిసిమెలిసి ఉండటంతో ఆయన జ్ఞాపకానికి అనుగుణంగా గౌడ సంఘం నాయకులు అయన కుటుంబానికి రెండు క్వింటాల బియ్యం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శ్రీశైలంగౌడ్, దేవరాజ్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, మల్లయ్యగౌడ్, నీక్ల సోమయ్యగౌడ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త హెడేల్లి సోమశేఖర్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా గురువారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండదండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలబోజు రమేష్, గిరగాని క్రాంతి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



డిపెండెంట్ వయోపరిమితి పెంపు ఘనత ఏఐటియుసిదే

ఏఐటీయూసీ నాయకులు

కొరిమి రాజ్ కుమార్, మోట పలుకుల రమేశ్

నవతెలంగాణ-కోల్ బెల్ట్

సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగుల వయో పరిమితి పెంపు ఘనత సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) దే అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్ అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కేటీకే - 1 , 5 ఇంక్లైన్ గనులలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండీ ఆసిఫ్ పాషా, పిట్ సెక్రెటరీ దోర్నాల తిరుపతి ద్వార సమావేశాలకు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రాజ్ కుమార్, రమేష్ వేర్వేరుగా హాజరై ప్రసంగించారు. కార్మిక గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కషి ఫలితంగానే డిపెండెంట్ ఉద్యోగుల వయసు 35 నుంచి 40 ఏండ్లకు పెంచడం జరిగిందని తెలిపారు. సింగరేణి ఎన్నికల, మెనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. సింగరేణి భవిష్యత్తు దష్ట్యా కొత్త గనుల ఏర్పాటు కు కషి చేస్తామన్నారు. కార్మికులకు రావలసిన లాభాల వాటాను త్వరితగతిన ఇప్పించడానికి పోరాటం చేస్తామన్నారు. కార్మికుల దీర్ఘకాలిక కల సొంతింటి కలను నెరవేర్చే దిశగా కృషి చేస్తామని, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక హక్కులకై చేసే పోరాటానికి ఎల్లవేళలా కార్మికులు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేటీకే-5 ఇంక్లైన్లో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గంగసారపు శ్రీనివాస్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రాంచందర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు, నాగేంద్ర బాబు, రాజేందర్, తుమ్మలపెల్లి శ్రీనివాస్, సమ్మి రెడ్డి, కూరపాటి శ్రీనివాస్, చుక్కయ్యఎస్. తిరుపతి, శ్రీకాంత్ రెడ్డి, ప్రకాష్, సుధాకర్, రమేష్ రెడ్డి, సికిందర్, రామక్రిష్ణ, శ్రీధర్ తదితరులు, కేటీకే-1 ఇంక్లైన్లో బ్రాంచ్ నాయకులు ఎండి రాజు మహమ్మద్, నూకల చంద్రమౌళి, టెక్నీషియన్ ఫిట్ సెక్రటరీ, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ, షిఫ్ట్ ఇన్చార్జిలు, మైనింగ్ కమిటీ, సేఫ్టీ కమిటీ, టెంపుల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలంలోని అంబట్ పల్లిప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సూరారం, రాపల్లికోట గ్రామ పంచాయతీలలో గురువారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, పురుషోత్తం, సత్య నారాయణ, కనకదుర్గ, శైలజ, రాజమౌళి, కారోబార్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

ధరణి లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్

ధరణిలో పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. గురువారం కలె క్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకై ధరణి లో వివిధ స్టేజీల్లో పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను త్వరగా పరి ష్కరించాలన్నారు. వివిధమాడ్యుల్లలో ఉన్నపెండింగ్ నివేదికలను పరిశీలించాలని, పరిష్కారానికి ఆస్కారం ఉన్న వాటిని త్వరగా పూ ర్తిచేయాలని,పరిష్కారం కాని వాటి నివేదికలను అందించాలన్నా రు. అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయాల ద్వారా జారీ చేసే సర్టి ఫికెట్లను జాప్యంలేకుండా త్వరగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ , తొర్రూరు ఆర్డీఓ నరసింహరావు, వివిధ మండలాల తహశీల్దార్ లు పాల్గొన్నారు.



బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఈ నెల 17న బక్రీదు పండుగ సందర్భంగా మత సామర స్యంతో ప్రశాంత వాతావరణంలో, చట్టానికి లోబడి పండుగను జరుపుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. గురువా రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమా ర్‌సింగ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, సంబంధిత జిల్లా అ ధికారులు, ముస్లిం మతపెద్దలతో కలిసి సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ఎవ రికి ఎలాంటి ఇబ్బంది కలుగచేయకుండా సంతోషంగా జరుపుకో వాలన్నారు. పండుగ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ల పరిధిలో ని ఈద్గాల వద్ద శానిటేషన్, లైటింగ్, మంచినీటి సౌకర్యం వంటి వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారుల కు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, మైనారిటీ అధికారిశ్రీనివాస్, మహబూబాబాద్, తొర్రూ రు, డోర్నకల్, మరిపెడ మునిసిపల్ కమిషనర్లు రవీందర్, శాంతి కుమార్, నరేష్‌రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుండి సేంద్రియ ఎరువు తయారీ

నవతెలంగాణ-మహబూబాబాద్



చెత్త నుండి సేంద్రియ ఎరువు తయారు చేసే బయోమైనింగ్ యంత్రాన్ని గురువారం మహబూ బాబాద్‌లో 26వ వార్డులో మున్సి పల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు. మహబూబాబాద్ పట్టణంలోని 26వ వార్డు సిగ్నల్ కాలనీ వద్ద ఉన్న మున్సిపల్ డంపింగ్‌యార్డును సందర్శించి బయోమైనిం గ్ ద్వారా చెత్తను శుద్ధిచేసి సేంద్రియఎరువు తయారుచేసి సిమెంట్ పరిశ్ర మలకు పంపిస్తున్నారని, చివరగా వచ్చే సేంద్రియ ఎరువును నాన్‌ఫుడ్ మొ క్కలకు ఎరువుగా ఉపయోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్ , వార్డు కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్ ఉన్నారు.

ఊరుపక్కతండా ప్రభుత్వ పాఠశాలకు దారి ఏర్పాటు

- 'నవతెలంగాణ' కథనానికి స్పందన

నవతెలంగాణ-మరిపెడ



మండలంలోని గుండీపూడి లోని ఊరు పక్క తండాలో ప్రాథ మిక పాఠశాలకు దారి లేక ఇబ్బం దులకు గురవుతున్న అంశంపై 'న వతెలంగాణ'లో వచ్చిన వార్త కథ నానికి వారు స్పందించారు. గురు వారం ఎంపీడీవో జి.రేవతి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి, పాఠ శాల ఉద్యోగులు ప్రహారి గోడలను ధ్వంసం చేసి కాంట్రాక్టర్ శ్రీనివాస్, పం చాయతీ కార్యదర్శి వెంకన్న ఆధ్వర్యంలో గురువారం పాఠశాలకు బాట సౌక ర్యం కల్పించడం పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులు హర్షంవ్యక్తం చేశారు.

నేడు మానుకోటలో జాబ్ మేళా

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లాలో ఫ్లిప్‌కార్ట్ సంస్థలో డెలివరీ బాయ్స్‌గా పని చేయుటకు 10వ తరగతి ఆపైన విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్ల పైబడిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని రెండవ అంతస్థులో ఉన్న జిల్లాఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళకు హాజరుకావాలని ఉపాధి అధికారి ఆర్డిఎస్‌పీ రామకృష్ణ తెలిపారు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు హెచ్ఆర్ మేనేజర్ బి.జ్ఞానకీర్తి 8374054911 ని సంప్రదించాలన్నారు.

మొలకెత్తని పత్తి.. ఆందోళనలో రైతులు

నవతెలంగాణ-ఇనుగుర్తి



ఇనుగుర్తి ప్రాంతంలో ఇటీవల భారీ వర్షం కురవడంతో పలువురు రైతులు పత్తి విత్తనాలు నాటారు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో తీ వ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురు స్తాయని ఆశతో అన్నదాతలు మొదటి వర్షానికే పత్తి విత్తనాలు నాటారు. వారం రోజులైనా మొలకెత్తక పోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అరకొరకురిసే వర్షాలకు తొందరపడి విత్తనాలు నాటోద్దని, వర్షాలు విస్తా రంగా కురిసి భూమి పూర్తిగాతడిసిన తరువాతే విత్తనాలు వేయాలని వ్యవ సాయ అధికారులు చెప్పిన వినకుండా రైతులు ఈనెల కూలీలను పెట్టుకొని పత్తి విత్తనాలు నాటారు. వారం రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో ఇనుగుర్తి, చెట్లముప్పారం, కోమటిపల్లి, చిన్ననాగారం మండలాల్లోని పలు గ్రామాల్లో పొలాలకు నీరు పెట్టుకునేందుకు పాట్లు పడుతున్నారు. వ్యవ సాయ బావులు లేని వారు బోరు, మోటార్లున్న రైతులు నీటిని సొంత బావు లు లేనివారు బోర్లు, బావులను అద్దెకు తీసుకొని పైపులు వేసి విత్తనాలకు నీరందిస్తున్నారు. ఇనుగుర్తి మండలం చిన్న నాగారం పరిధిలోని రైతు కో మ్మనబోయిన మహేందర్ రెండెకరాల్లో పత్తి విత్తనాలు నాటారు. విత్తనాలు మొలకెత్తక పోవడంతో బావి మోటారుతో పొలానికి నీరందిస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-తొర్రూరు

నేడు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తొర్రూరులోని వికాస్ హై స్కూల్ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'రక్తదానం'పై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తొర్రూరు డివిజన్ పాలక మండలి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు గురువారం తెలిపారు. ప్రతీ ఏడా ది జూన్ 14న ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కా ర్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు తొర్రూర్ లోని వికాస్ స్కూల్ ఆవరణలో నిర్వహించబడుతుందన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


నవతెలంగాణ-గూడూరు



మండలంలోని పలుగ్రా మాల్లోని గుడుంబా స్థావరాలపై ఎ స్సై నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించా రు. ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మండలంలోని చి ర్రకుంటతండా, పులిసింగ్ తండాల్లో గుడుంబా స్థావరాలుపై దాడులు ని ర్వహించి 300 లీటర్ల బెల్లంపానకం ధ్వంసంచేసి 30 లీటర్ల గుడుంబా స్వా ధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సేవలు కొనసాగించాలి

నవతెలంగాణ-తొర్రూరు



గ్రామీణ వైద్యుల బతుకు భరో సాలో భాగంగా వారిని యధా విధిగా గ్రామాలలో ప్రాథమిక వై ద్య సేవలను అందించుటకు వెంట నే అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని గ్రామీణ వైద్యుల మండల శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం డివిజన్ కేం ద్రంలో గ్రామీణ వైద్యుల బతుకు భరోసా ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా మండల శాఖ బాధ్యులు అన్నపురం వెంకన్న గౌడ్, షేక్ అంకుస్ లు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2009 సంవత్సరంలో 1273, 428 ఉత్తర్వు ల ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపి, పిఎంపి వైద్యులకు పారామెడికల్ శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్స్ జారీ చేసే క్ర మంలో అనివార్య కారణాల వలన మధ్యలోనే నిలిపివేయడం జరిగిందన్నా రు. దీనిని తిరిగి పునరుద్ధరించి ఆర్ఎంపి పీఎంపీల శిక్షణ పూర్తి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ వైద్యులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వారి ఆకస్మిక తనిఖీలు వెంటనే నిలిపివేసి గ్రా మీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందించుటకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిం చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దొంతు సత్యం, మాదారపు ప్ర కాష్, గుడిషాల నవీన్, సింగారపు భీమయ్య, ధర్మారపు హనుమంతు, మ న్యం వెంకన్న, కుసుమ అమ్మదాస్, రాగి జగదీశ్వర్, జి.వెంకటేష్, సిరికొండ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు 'పరీక్ష' నిర్ణయాన్ని విరమించుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్
- కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల ధర్నా



నవతెలంగాణ-మహబూబాబాద్

గత అనేక సంవత్సరాలుగా ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తూ, అనుభవాన్ని గడించిన ఆశా వర్కర్లకు మళ్ళీ కొత్త గా పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం త క్షణమే రద్దు చేసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుం ట ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాల యం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 33ఏళ్లగా పనిచేస్తున్నారని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఇ చ్చిన అనేకరకాల శిక్షణలు పొందారన్నారు. రిజిస్టర్లు రాయ డం, ఆన్‌లైన్ చేయడం, ప్రజలకు మందులు అందజేస్తూ, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలతో పాటు ప్రజలందరికీ ఆ రోగ్యసేవలు క్షేత్రస్థాయిలో అందిస్తున్నారన్నారు. కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డు కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇన్ని పనులు చేస్తూ ఇంత సీనియార్టీ ఉన్న ఆశాలకు కొత్తగా ఎగ్జామ్స్ పెట్టి వారి జ్ఞాపక శక్తిని మరల నిరూపించుకోమని చెప్పడం సమంజసం కాద న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎగ్జామ్స్ ని ర్వహించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా ఆశాలు రాష్ట్రవ్యా ప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేసిన ఫలితంగా అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రద్దుచేశారని తెలిపారు. అసెం బ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనంలాంటి హామీల అమలుకు పూనుకో వాలే కాని ఆశాలకు కొత్తసమస్యలు తెచ్చి పెట్టడం తగదన్నా రు. ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలుగా ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ప్రతి నెల రెండవ తేదీన వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని, ఇన్సూరెన్స్ 50 లక్షలు, అంత్యక్రియలకి రూ.50వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలతో పాటు సగం వేతనం పెన్షన్ గా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆశాలకు పనిభారం తగ్గించాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ కి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పోతుగంటి మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, ఆశ యూనియన్ జిల్లా నాయకులు ఉపేంద్ర, సుజిత, కాలేశ్వరి, ఆసియా, సునిత, రమ, నిర్మల, జ్యోతి, సంధ్య, పుష్ప, ప్రమీల, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య

నవతెలంగాణ మహబూబాబాద్

ఇండ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కా ర్యదర్శి వర్గసభ్యులు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదల సమావేశం సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చీపిరి యాకయ్య అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై న సోమయ్య మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు అవుతున్నప్పటికీ ఇంకా ఇంటిస్థలంలేని నిరుపేదలు ఇంకా చాలామంది ఉన్నార ని వారికి ఇంటిస్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాం డ్ చేశారు. కొత్తగా రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపక్షాన నిలబడి ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరుగ్యారంటీలు అమలు చేయాలని కోరారు. పేద ప్ర జలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టినగతే పడుతుందన్నారు. ప్రభుత్వ అధికా రులు స్పందించి పేదలకు నిలువనీడ చూపాలని కోరారు, లేకుంటే ఇంటి స్థలం లేని పేదలను సమీకరించి భారీఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నా యక్, పట్టణ కమిటీ సభ్యులు యమగాని వెంకన్న, భానోత్ వెంకన్న, తోట శ్రీని



వాస్, బూర్గుల లక్ష్మణ్, బానోత్ శ్రీరామ్ నాయక్, ఎడబోయిన శ్రీనివాస్, గోపి సునీత, ఎస్‌కే.నిజం, దొడ్డరాజేశ్వరి, పెరుమండ్ల విజయలక్ష్మి, ఇందిరా, బండోజు సునీత, బైగళ్ళ ప్రియాంక, అన్వేష్, అద్యం లక్ష్మి, జోరుకా రేణుక, మాలోత్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసు అధికారుల దాడులు





నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గుడుం బా సావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ నుండి అధి కారులు, సిబ్బంది కలసి గుడుంబా స్టావారాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 42 కేసులు నమోదు చేసి రూ.1,60,800ల విలువ చేసే 402 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, రూ.11,10,000ల విలువ చేసే 11,100 లీ టర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ గుడుంబా స్థావరాలకు చోటు లేదని ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పటిక, బెల్లం అక్రమ రవాణా పైన దృష్టి పెట్టాలన్నారు. గుడుంబా వల్ల జరిగే అనర్థాలపై అ న్నిగ్రామాల్లో ప్రజలకు, తయారీదారులకు అవగాహనా కల్పించాలన్నారు. ఈ దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తొర్రూరు రూరల్ : జిల్లా ఆదేశాల మేరకు తొర్రూర్ డిఎస్పి సురేష్ ఆధ్వ ర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులుచేసి రూ.68 వేల విలువగల నాటుసా రా స్వాధీనం చేసుకొని గుడుంబా బట్టీలను ధ్వంసం చేసి రూ.7.75 లక్షల విలు వగల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తొర్రూర్ డివిజన్ పరిధిలోని అన్ని పో లీస్ స్టేషన్ నుండి అధికారులు సిబ్బంది కలిసి గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో తొర్రూర్ సబ్ డివిజన్‌లో 16 కేసులు నమోదు చేసి రూ.68 వేల విలువ గల 170 లీటర్ల నాడుసారా స్వాధీనం చేసుకుని రూ.7.75 లక్షల గల 7750 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు తొర్రూర్ డిఎస్పి సురేష్ తెలిపారు. గుడుంబా స్థావరాలకు చోటు లేదని ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇనుగుర్తి : మండలం పరిధిలోని శివారు తారాసింగ్ తండాలో గురువా రం పోలీసులు గుడుంబా స్థావరలపై దాడులు చేశారు. ఎస్ఐ వంశీధర్ ఆధ్వ ర్యంలో తన సిబ్బందితో మండలంలో గుడుంబా తయారు చేస్తున్న ప్రాంతాలను గుర్తించి దాడులు చేశారు. 200 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి, సుమారు 15 లీటర్ల గుడుంబాను స్వాధీన పరుచుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కొంతమంది గుడుంబా తయారీదారులను గుర్తించవలసి ఉందని, వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యహెర్బ్స్ కారం మిల్లు మూసివేయాలని నిరసన

నవ తెలంగాణ -మరిపెడ

మరిపెడ మున్సిపల్ కేంద్రంలో గత కొంత కాలంగా విషవాయువులు వెదజల్లుతూ,ప్రజలలో వివిధ రుగ్మతలకు కారణమవుతున్న విద్య హెర్బ్స్ కారంఫ్యాక్టరీని తక్షణమే మూసివేయాలని మరిపెడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం మున్సి పల్ కేంద్రంలోని డాక్టర్ భీంరావు అంబేడ్కర్ విగ్ర హం వద్ద సమావేశమై మున్సిపల్ కమిషనర్ వెంక టస్వామికి మున్సిపల్ కార్యాలయంలో విద్య హెర్బ్స్ మూలంగా గ్రామంలో జరుగుతున్న అనర్థాలు, ప్ర జల ఆరోగ్య పరిస్థితి వివరించారు. అనంతరం త హశీల్దార్ కార్యాలయం, డిప్యూటీ తహసీల్దార్ కా ర్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. అనం తరం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్ కుమార్‌కు విద్యహెర్బ్స్ మూలాన



మరిపెడతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజ ల ఆరోగ్యంపై దుష్ప్రభావం కలుగుతుందని వివా రించారు. ఇప్పటికే కారం మిల్లు వ్యర్థాలతో గ్రామం శివారులోని నల్లచెరువు కలుషితమై,చేపల ఉత్పత్తి పూర్తిగా దెబ్బ తిందన్నారు. నీళ్ళు కలుషిత మై మూ గ జీవాలు నీళ్ళు తాగటం లేదన్నారు.ఫ్యాక్టరీ వ్య ర్థాల వలన సమీపంలోని పంట పొలాలు,మామిడి తోటల్లో ఉత్పత్తి తగ్గిందన్నారు. తప్పుడు సమాచా రంతో వివిధ ప్రభుత్వ శాఖల అనుమతులను తెచ్చుకొని మిర్చి ఫ్యాక్టరీ నిర్మించారని కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమా డుతున్న విద్య హెర్బ్స్ మిర్చి ఫ్యాక్టరీని పూర్తిగా మూసివేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గంట్ల గోవర్ధన్ రెడ్డి,డాక్టర్ అజీజ్, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, వేర్మరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కుడితి నరసింహారెడ్డి, పర్వతం చంద్రశేఖర్, ఉడుగుల రాజు, వంగవీటి భరత్, ఉప్పల సతీష్ గంధం భద్రయ్య, బాషిపంగు శివ, వెన్నె భరత్, బా లనాగు శివశంకర్, అజయ్ చారి, బాల కష్ణ చారి, సా దిక్, గంధం వీరన్న,నిర్మల రాజు ,గంధసిరి చొక్కం తదితరులు పాల్గొన్నారు.

సిసి ఐలయ్యకు డిఆర్డిఏ ఏపీడి పరామర్శ

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని అయోధ్యపురం క్లస్టర్‌లో డిఆర్డిఏ-సెర్ప్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కందిక ఐలయ్య సతీమణి కందిక పూలమ్మ అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం రా త్రి మృతి చెందారు. పూలమ్మ మతి చెందిన సమాచారం అందుకున్న మహబూ బాబాద్ డిఆర్డిఏ ఏపిడి జయశ్రీ, హెచ్ఆర్‌డిపిఎం అశోక్‌పాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గురువారం పూలమ్మ పార్థివ దే హాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలయ్యను కుటుంబ



సభ్యులను ఓదార్చే మృతి గల కార ణాలను అడిగి తెలుసుకున్నారు. ద హన సంస్కారాల నిమిత్తం ప్రభు త్వం తరపున అందవలసిన ఆర్థిక స హాయాన్ని ఎపిడి జయశ్రీ అందజేశా రు. బాధిత కుటుంబాన్ని గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంపీటీసీ కత్తి స్వామి, వంకడోత్ కొమ్మాలు, సెర్ప్ ఐకెపి ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా నాయకులు. గుల్లపల్లి శ్రీనివాస్, కందిక రమేష్, గోలి కొమురయ్య ఆలేటి శ్రీనివాస్, స్త్రీ నిధి ఆర్ఎం మధుకర్‌లు పరామర్శించారు.

ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు

నవతెలంగాణ-మహబూబాబాద్



ప్రభుత్వ పాఠశాలలో పే ద విద్యార్థులకు ప్రభుత్వం క ల్పించిన సౌకర్యాలను సద్విని యోగం చేసుకొని అభివృద్ధి లోకి రావాలని ఎమ్మెల్సీ తక్కె ళ్ళపల్లి రవీందర్‌రావు కోరారు గురువారం మహబూబాబాద్ పురపాలక సంఘం 24వ వా ర్డు ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చే పడుతున్న జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు మాట్లాడారు. నేడు రాష్ట్రంలో ఉన్న చాలా మంది ఎంపీలు ఎమ్మెల్యేలు, అధికారులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత అభివద్ధిలోకి వచ్చిన వా రే అని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు పిల్లల ను చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెం కన్న మున్సిపల్ కౌన్సిలర్ ఎడ్ల వేణు స్కూలు ప్రిన్సిపాల్ రమేష్, మోహన్, ఆర్‌పి.రేష్మ, ఉమా, మార్నేని కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీని విధుల నుంచి తొలగించాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య

నవతెలంగాణ-గూడూరు



తప్పుడు ధ్రువపత్రాలతో క స్తూర్బాగాంధీ బాలికల విద్యాల యంలో పీఈటీగా విధులు ని ర్వహిస్తున్న రజితను వెంటనే వి ధులనుంచి తొలగించాలని తు డుందెబ్బ జిల్లా అధ్యక్షులు బొల్లి సారయ్య అన్నారు. గురువారం బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన సమావేశంలో సారయ్య మాట్లాడుతూ అధికా రులను తప్పుదోవపట్టించి నకిలీ ధృవీకరణ పత్రాలతో గత కొన్నేళ్లుగా పీఈటి గా విధులు నిర్వహిస్తున్న రజితపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సమా వేశంలో నాయకులు బత్తుల రామన్న, పూనెం యాకయ్య, ఈసం గణేష్, పూ నెం మునేందర్, పూనెం చిన్నవీరస్వామి, పూనెం సురేష్, ఆగబోయిన చంద్రం, పూనెం లోకేష్, రాజు, సాయి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని నిరసన

నవతెలంగాణ-మరిపెడ



మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని డి మాండ్ చేస్తూ మండలంలోని ఉ ల్లేపల్లిలో వాటర్‌ప్లాంట్ ఎదురు గా గ్రామస్తులు గురువారం నిర సన వ్యక్తం చేశారు. 'నవతెలంగా ణ'లో వచ్చిన వార్త కథనాలపై స్థానికులు తీవ్రంగా స్పందించారు. ఈ నేపథ్యంలో సాంకేతిక కారణాలవల్ల వాటర్‌ప్లాంట్ పనిచేయక పోవడంతో గ్రామస్తులకు తాగునీరు అందడం లేద న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ ను రిపేర్ చేయించు తక్షణమే తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరారు. వాటర్ ప్లాంట్‌ను 20 17లో ప్రారంభించగా ఆనాటి నుండి స్థానిక సర్పంచ్ తన ఆధీనంలో ఉంచు కున్నారని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బొడ్డు వెంకన్న ఆరోపించారు. ఈ విష యంపై స్థానిక పంచాయతీ కార్యదర్శి మధుకర్ ను వివరణ కోరగా గత పం చాయతీ పాలనలో కొనసాగినవాటర్‌ప్లాంట్ సాంకేతిక కారణాలవల్ల పనిచేయ డం లేదన్నారు. ఈ వాటర్ ప్లాంట్ నిర్వహణ కోసం గ్రామంలోని బహిరంగ ప్రకటన ద్వారా ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణకు వేలం వేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి నిధులు రాకపోవడంతో గ్రామ పంచాయతీ నిర్వహణ భారంగా మారిందన్నారు. త్వరలో తాగనీటి సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఫీజుల నియంత్రణపై చిత్తశుద్ధి లేని పాలకులు

నవతెలంగాణ-తొర్రూరు



కార్పొరేట్, ప్రైవేట్ పాఠశా లల్లో జరుగుతున్న దోపిడీని అ రికట్టాలని ఆమ్‌ఆద్మీపార్టీ విద్యా ర్థి విభాగం సివైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ సురేష్ బా బు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేష్‌బాబు మా ట్లాడుతూ విద్యాశాఖ అధికారులఅలసత్వంవల్ల యాజమాన్యాలు ఇష్టానుసా రం ఫీజులు పెంచుతూ పోతుండడంతో పేద విద్యార్థులకు చదువు అందని ద్రాక్షలా తయారైందన్నారు.సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నారని, ఫీజుల నియంత్రణ పై పాలకులకు, అ ధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో యాజమాన్యాలు ఫీజులు తమ ఇష్టారా జ్యాంగ పెంచుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజుల నియం త్రణకు చట్టం తెస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేద న్నారు. తొర్రూరు మండల కేంద్రంలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కార్పొరేట్ పాఠశాలలు నెలకొల్పుతున్నారని ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముఖేష్, నితిన్, జై వీర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో కాపురవేణి రాజయ్య(47), ఐలాపురం బాపు(45) ఇద్దరు మృతి చెందగా, మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన ఉరగొండ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలైన సంఘటన కాటారం మండలం విలాసాగర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల పూర్తి కథనం ప్రకారం.. రాజయ్య తల్లి దామరకుంటలోని ఆయుర్వేద ఆస్పత్రిలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె అనారోగ్యానికి గురికావడంతో తన తల్లి వంతుకు రాజయ్య ఆయుర్వేద ఆస్పత్రిలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆస్పత్రిలో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై దామెరకుంట నుండి విలాసాగరకు ఇదే గ్రామానికి చెందిన ఐలాపురం



బాపును ఎక్కించుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఉరగొండ శ్రీనివాస్ ఇద్దరు ఎదురెదుగా ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో రాజయ్య, బాపు కిందపడిపోయారు. వారి బైక్ వెనకాలనే వస్తున్న ట్రాక్టర్ వారిపై నుంచి వెళ్లగా అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందారు. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం కాటారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని మృతదేహాలతో రోడ్డుపై గ్రామస్తులు నిరసన, ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కాటారం సీఐ నాగార్జునరావు తన బృందంతో సంఘటన స్థలానికి చేరుకొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముంపు నివారణకు ప్రణాళికలు రూపొందించాలి

- మంత్రి ధనసరి సీతక్క

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లాలో భవిష్యత్‌లో ముంపునకు గురి కాకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలను రూపొందిం చాలని పంచాయితీరాజ్, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పి షబరిష్, ఐటిడిఏ పీఓ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు పి శ్రీజ, సీహెచ్ మహేందర్ జి, ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ బి గితే, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి వరద సంసిద్ధత, వరద ముంపు నివారణకు చర్యలు, అభి



వృద్ధి పనులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వర్షాకాలం వరదలు సంభవించే క్రమంలో ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుండి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వరదల సమయంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షా కాలంలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు వానాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధుల పటల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. లేదంటే కాంట్రాక్టర్‌లను తొలగిస్తామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని, స్థానిక పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం ముందు జాగ్రత్త చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఇరిగేషన్, నేషనల్ హైవే, పంచాయితీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రిసిటీ, ఇంజినీరింగ్ అధికారులు, 9 మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికతో చదివితే పక్కా విజయం

- జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి/మల్హర్‌రావు/మహాదేవపూర్

పోటీపరీక్షల సన్నద్ధతకు గ్రామీణ నేపథ్యం, పేదరికం అడ్డు కాదని పక్కా ప్రణాళికతో చదివితే విజయం వరిస్తుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలిస్‌శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రికగ్నైజ్డ్ ప్రవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సహకారంతో కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్‌లో 60 మంది నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదరికంతో పోటీ పరీక్షలకు దూరమవుతున్న అటవీ గ్రామాల నిరుద్యోగ అభ్యర్థులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ట్రస్మా కాటారం అధ్యక్షులు శ్రీశైలం, కాటారం, మహాదేవ్ పూర్ సీఐలు నాగార్జున రావు, రాజేశ్వరరావు, కాటారం, కాళేశ్వరం, కొయ్యూరు, అడవి ముత్తారం, ఎస్సైలు అభినవ్, భవాని సేన్, నరేష్, మహేందర్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఎస్పీ సన్మానం

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు మడక మధు ఐకోడింగ్, ఇయర్ కోడింగ్ ప్రత్యేక భాష, ప్రత్యేక లిపి తయారు చేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా సన్మానాలు పొందారు. గురువారం కాటారం బీఎల్ఎం గార్డెన్లో జరిగిన కార్యక్రమంలో కాటారం డీఎస్పీ ఆహ్వానం మేరకు ఆయనను ఎస్పీ సన్మానించారు. భాష ద్వారా ప్రత్యేకమైన సంజ్ఞలతో ఇంటలిజెన్స్ విభాగాలకు ఉపయోగపడే రీతిలో ప్రత్యేకత చాటుకున్న భాష, లిపి ని తయారుచేసిన ఉపాధ్యాయులు మడక మధు, జి రాజబాబు, బొల్లం సతీష్ తదితరులను సత్కరించారు. పోలిస్ విచారణలో కోడ్ డీకోడింగ్ భాష ఉపయోగ పడుతుందని, దీనిపై ప్రభుత్వ యంత్రాంగానికి సూచిస్తానని ఎస్పీ తెలిపారు.



జీఓ-51 రద్దు చేయాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

జీఓ 51ని రద్దు చేయాలని,పెండింగ్ సమ్మె కాలం నాటి వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు కారోబార్, బిల్ కలెక్టర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాదుల శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒరుగంటి రఘు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 51 జీవో రద్దుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లుగా, ఎవరి కేటగిరి వారికి ఇప్పించే ప్రక్రియ సైతం కొనసాగుతుందని మంత్రి తెలిపినట్టుగా ప్రకటించారు. ఇందుకు మంత్రికి, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అశోక్, ములుగు జిల్లా అధ్యక్షుడు జితేంద్ర చారి, మాధవ్ స్వామి పాల్గొన్నారు.



బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

- వళ్లెంకుంట పంచాయతీ కార్యదర్శి నరేశ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండలంలో వళ్లెంకుంట పంచాయతీ కార్యదర్శి నరేశ్ అన్నారు. గురువారం వళ్లెంకుంట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి,ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ వంటి సౌకర్యాలు గురించి వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జీపీఏ సాధిస్తున్నారని అన్నారు. అనంతరం పాంప్లెయిన్స్ ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి సుదర్శన్, ఉపాధ్యాయులు మెహరాజ్,సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య : మంత్రి సీతక్క

నవతెలంగాణ - ములుగు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని ప్రతి పేదవారికి ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి 2024-25 విద్య సంవత్సరంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు, ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు ఉచిత వసతితో పాటు కాస్మెటిక్స్ ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియం నర్సరీ విద్య అందిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందిం చేందుకు కృషి చేయాలన్నారు. జూన్ 6 నుండి 19 వరకు బడి బాట నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ విద్య సంవత్సరం జిల్లాలో చదివే 19,645 మంది పిల్లలకు ఏక రూప దుస్తులు మహిళ సంఘాల ద్వారా కుట్టించామన్నారు. 1, 71,150 ఉచిత పాఠ్య పుస్తకాలకు గాను 1,42,510 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 95,913 ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని ప్రభుత్వ, లోకల్ బాడీ, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల, గురుకులలో 367 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను నియమించి మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ. 6.91 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఐటీడీఏ పరిధి 99 ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠ శాలల్లో కూడా పనులు చేపట్టామన్నారు. నేటి వరకు 256 పాఠశాలల్లో ఎం పిక చేసిన అన్ని రకాల పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజ, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ములుగు ఎంపీపీ గండ్ర కోట శ్రీదేవి, డీఈఓ పాణిని, డీఎస్పీ రవీందర్, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రద్దు చేయాలి

- ఆశాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత
- ఆగస్టు వరకు సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ - ములుగు

రాష్ట్రంలో ఆశాలకు పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుండి జాతీయ రహదారిపై భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నాలుగు గంటల పాటు ధర్నా చేశారు. మంత్రి సీతక్క కలెక్టర్ సమావేశపు హాల్‌లో సమీక్ష సమావేశంలో ఉండగా మంత్రి రావాలని ఆశాలు పట్టుబట్టారు. ధర్నా స్థలం కు డీఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య వచ్చి ఆశాలతో మాట్లాడి సీతక్క దగ్గరకు తీసు



కెళ్లి వినతిపత్రం ఇప్పించారు. మంత్రి స్పందించి పరీక్ష లేకుండ చూస్తానని, జీతాలు కూడా బడ్జెట్ లోటు వల్ల ఇవ్వలేకపోతున్నామని వెంటనే ఇస్తామని, ఫిక్స్ వేతనం ఇతర అన్ని సమస్యలు మా దష్టిలో ఉన్నాయని ఆగస్టు వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశావర్కర్లు గిరిజన ప్రాంతాల్లో గత 33 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, ప్రారంభం నుండి ఇప్పటివరకు అనేక రకాల ప్రభుత్వం ఇచ్చిన ట్రైనింగులు పొందారని అన్నారు. రిజిస్టర్లు రాయడం, ఆన్లైన్ పనిచేయడం, ప్రజలకు మందులు అందజేయడం, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు, ఇతర ప్రజలందరికీ ఆరోగ్య సేవలు క్షేత్రస్థాయిలో అందిస్తున్నారన్నారు. కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారని అన్నారు. వీరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ లీడర్స్ అవార్డు కూడా ప్రకటించిందన్నారు. ఇన్ని పనులు చేస్తూ సీనియార్టీ ఉన్న ఆశాలకు కొత్తగా ఎగ్జామ్స్ పెట్టి వారి శక్తి సామర్థ్యాలను నిరూపించుకోమని చెప్పడం సమంజసం కాదని అన్నారు. జీతాలు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి నెల 2వ తేదీన ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.18 వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని అన్నారు. పెండింగ్ సర్వేల డబ్బులు చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ యూనియన్ జిల్లా నాయకులు గుండెబోయిన రవిగౌడ్, ఎం శ్రావ్య, మంజుల, నాగమణి, రాజ్యలక్ష్మి, రాధ, సరిత, ఉషారాణి, సత్యవతి, రమాదేవి,సంధ్య, రజిత, చంద్రవాని, శోభ, ఖాసీం బి, కవిత, అరుణ పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-భూపాలపల్లి

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టు కొండలక్ష్మి, జిల్లా నాయకులు క్యాతం విజయ, సీఐటీయూ నాయకులు ఆకుదారి రమేష్, వెలిశెట్టి రాజయ్య, రవికుమార్, శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ఆశా వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆశవర్కర్లకు పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఆశా వర్కర్లు కొన్నేండ్లుగా ప్రభుత్వాలు అప్పజెప్పే అన్ని పనులతోపాటు అనే సేవలు ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. కొత్తగా ఆశాల జ్ఞాపకశక్తిని మళ్ళీ నిరూపించుకోవాలని చెప్పడం సమంజనం కాదన్నారు. ఆశాలకు ఎగ్జామ్స్ నిర్వహించి ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్ వల్ల ఆశాలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఆశాల జ్ఞాపకశక్తిని కొత్తగా నిరూపించుకుంటే ఒక సర్టిఫికెట్‌కు రూ. 5,000 ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని దానిని విరమించుకోవాలన్నారు. ఆశాలు అనేక సంవత్సరాలు నుండి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారని అన్నారు. అశాలకు నష్టం కల్గించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసం హరించుకొని ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశాలు తిరుమల, శైలజ, రాజేశ్వరి. సరిత, శారద, కుమారి, రమ, జయప్రదతోపాటు 300 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'బదిలీలు, పదోన్నతులు' చేపట్టాలి

నవతెలంగాణ - ములుగు

గిరిజన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ములుగు ఎమ్మెల్యే కార్యాలయంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి మంత్రి సీతక్కకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మాదిరిగానే ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖలో ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో సుమారు 5000మంది ఉపాధ్యాయులు గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదలపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లింగాల శ్రీరాములు, ఉపాధ్యక్షులు ఇరుప సారయ్య దొర, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొప్ప సమరావు, డిటిఎఫ్ చెరలు, రాజారత్నం, టిఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజు నాయక్, పిఆర్టియు టిజి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్న నాయక్, వెంకటాపూర్ మండల జనరల్ సెక్రెటరీ రాంకుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

నవతెలంగాణ -తాడ్వాయి

వర్షాకాలం సమీపిస్తున్నందున జంపన్న వాగు ముంపు ప్రాంతాలైన ఊరట్టం, ఎలుబాక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముంపు ప్రాంతాలైన గ్రామాలను సందర్శించారు. వారి బాగోగులు ను అడిగి తెలు సుకుని వర్షాలు కురిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అధికంగా వర్షాలు కురిసినప్పుడు వరదలు ప్రవహించినప్పుడు ధన, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. వాతావరణ పోలిస్ శాఖ వారి సూచనల మేరకు నడుచుకోవాలని సూచించారు. వరదల ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పోలీసుల సూచనల మేరకు తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. కలరా, డయేరియా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సివిల్ సీఆర్పీఎఫ్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరదల పట్ల అవగాహన తప్పనిసరి : ఎస్సై

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఈ వర్షాకాలంలో ముంపు ప్రాంతాల ప్రజలు వరదల పట్ల అవగాహన తప్పనిసరి కలిగి ఉండాలని పస్రా ఎస్సై ఏ కమలాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వీల్స్ కాలనీని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో అధిక వర్షాల వల్ల వరద తాకిడి పెరిగితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో గ్రామస్తులకు సూచించారు. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. వరద ముంపునకు గురి కావడానికి అవకాశం ఉన్న ప్రాంతాల వారు వర్ష తీవ్రత బట్టి వరద తాకిడిని అంచనా వేయాలని అన్నారు. వరద ఉధృతి పెరిగితే ఆ ప్రాంతాన్ని కాలీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. పోలిస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే జీఎస్సార్

నవతెలంగాణ-టేకుమట్ల

టేకుమట్ల రాఘవరెడ్డిపేట గ్రామాల చలి వాగు బ్రిడ్జి పునర్నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం వంతెన నిర్మాణ పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వర్షాకాలం అధిక వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోయిందని అన్నారు. వంతెన పునర్నిర్మాణ పనులకు రూ.4.70కోట్లు మంజూరు చేశామని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వాగు అవతలి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా వర్షాకాలంలోపే బ్రిడ్జిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్, జిల్లా నాయకులు ఎస్ఎస్ఆర్, అప్పం కిషన్, మండల నాయకులు తోట గట్టయ్య, సర్వోత్తమ్ రెడ్డి, వంగ నరేష్, దాసరి కుమారస్వామి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

నవతెలంగాణ-గణపురం

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 17మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత పాలకుల కంటే భిన్నంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఎంపీపీ కావాటి రజిత రవీందర్, వైస్ ఎంపీపీ అశోక్, తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీఓ భాస్కర్, సొసైటీ చైర్మన్లు గండ్ర సత్యనారాయణ రెడ్డి, కన్నెబోయిన కుమార్ యాదవ్. ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్‌గౌడ్, సుధర్మ మలహాల్రావు, కోఆప్షన్ సభ్యుడు చోటేమియా, మాజీ సర్పంచ్ నారగాని దేవేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రేపాక రాజేందర్, కొత్త వెంకన్న, కట్కూరి శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు

టేకుమట్ల : పేదింటి ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి పథకం వరం లాంటిదని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు.



గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు మంజూరైనా రూ.31 లక్షల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. తహసీల్దార్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, ఎంపీటీసీ సంగి రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ తునికాకు బోనస్ చెల్లించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-వెంకటాపురం

పెండింగ్ తునికాకు బోనస్ డబ్బులు వెంటనే ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన 30 గ్రామాల తునికాకు కార్మికులు వందల సంఖ్యలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ డివిజన్ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అటవీశాఖ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకటరెడ్డి మాట్లా డుతూ 2016 నుంచి బోనస్ చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారఅన్నారు. గతంలో జిల్లా అటవీశాఖ దృష్టికి తీసుకెళ్లితే ఎకౌంట్లో తప్పులు, ఐఎఫ్ఎసీ కోడ్ మారడం వల్ల డబ్బులు జమ కాలేదని సరిచేసి జమ చేస్తామని హామీనిచ్చి 6 నెలలు గడుస్తున్నా డబ్బులు జమ కాలేదన్నారు. ఈ ఏడాది కూడా నెల గడుస్తున్నా డబ్బుల చెల్లింపులో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారని ఆరోపిం



చారు. జిల్లా అటవీ శాఖ అధికారి దృష్టికి తీసెకెళ్లగా రేపు గ్రామానికి ఒకరు చొప్పున డివిజన్ అటవీశాఖ కార్యాలయానికి వస్తే వారి సమక్షంలో బోనస్ చెల్లింపులపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. దీంతో వారు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొప్పుల రఘుపతి, గ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు వంకా రాములు,, కుమ్మరి శ్రీను, నాయకులు దామోదర్, కట్ల నరసింహ చారి, 30 గ్రామాల తునికాకు కార్మికులు పాల్గొన్నారు.

రేగొండలో దొంగల బీభత్సం



పూజారి ఇంట్లో చోరీ

9 తులాల బంగారం, వెండి అపహరణ

నవతెలంగాణ-రేగొండ

మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మండల కేంద్రానికి చెందిన పూజారి ఇంట్లో భారీ బంగారం, వెండి, నగదును అపహరించారు. బాధితులు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రేగొండ గ్రామానికి చెందిన సముద్రాల సురేష్ ఆచార్యులు - పద్మావతి దంపతులు గత మూడు రోజుల క్రితం అత్యవసర పనులపై హైదరాబాదులో ఉన్న వారి కూతురు సగృహానికి వెళ్లారు. ఇదే అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు వారి పహరి గోడ మీది నుండి వెళ్లి ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి 9 తులాల బంగారం, వెండి ఆభరణాలు, 5వేల నగదు అపహరించారు. కాగా దొంగలు పహరి గోడ దూకి వెళ్తుండగా శబ్దం వచ్చి ఇంటి పక్కనే ఉన్న ప్రశాంత్ చారి, భరత్ అనే ఇద్దరు యువకులు గమనించి దొంగలను వెంబడించగా మసీదు దారి నుండి తప్పించుకొని పారిపోయినట్లు తెలిపారు. ఊరిలో ఉన్న మరికొందరికి సమాచారం అందించి అందరూ కలిసి గాలించగా వాటర్ ట్యాంక్ ప్రక్కన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా బైక్ పార్క్ చేసి ఉండగా పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ద్విచక్ర వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సురేష్ ఆచార్యులు హుటా హుటిన గురువారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో చూడగా 9 తులాల బంగారంతో పాటు, వెండి ఆభరణాలు ఐదువేల నగదును అపహరించకపోయినట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్, పోలీస్ సిబ్బంది, క్లూస్ టీం తో కలిసి ఫింగర్ ప్రింట్స్ ను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు.



18వరకు రాజకీయ శిక్షణ తరగతులు

దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు

నవతెలంగాణ-భూపాలపల్లి

ఈనెల 18వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు కోరారు.గురువారం భూపాలపల్లి పట్టణం లో కొమురయ్య భవన్ లో డిహెచ్‌పిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరాటీ కాంతారావు, రాసపల్లి భద్రయ్య మాట్లాడుతూ... తరతరాల అణిచివేత అంటరానితనం, వివక్షత, దోపిడీ, పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష స్వామిక కులాల అభ్యున్నతి లక్ష్యంగా ఆవిర్భవించింది దళిత హక్కుల పోరాట సమితి అన్నారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు 2024 జూన్ 18,19,20 తేదీల్లో లక్ష్మి నరసింహ స్వామి ఫంక్షన్ హాల్, యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లా జరుగుతున్నాయని తెలిపారు. దళితులు, మేధావులు యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో దళితుల ఆర్థిక, రాజకీయ, సామాజిక,హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కొరకు, కుల వివక్షత నిర్మూలన కొరకు ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ని మరింత బలోపేతం చేయాలని, దళితులకు కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా, స్వయం ఉపాధి పథకాల అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నేరెళ్ల జోసఫ్, పీక రవికాంత్, పెద్దమాముల సంధ్య, చిట్యాల పద్మ చల్లూరి రక్షిత, రేవెల్లి రాధిక, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది



నవతెలంగాణ-మల్హర్‌రావు

అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చంద్రగిరి ఎంకమ్మ కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు కొండ రాజమ్మ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజిరెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అధైర్య పడొద్దు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, రూ. 5 వేలు ఆర్థిక సాయం చేసి చేయుతనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రవి, గ్రామ ఇంచార్జి అధ్యక్షుడు చంద్రగిరి సంపత్, కాంగ్రెస్ నాయకులు వేముల చంద్రమోహన్, అల్లాడి సురేష్, దుద్దిళ్ల సత్యం, చంద్రగిరి అశోక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రానికి చెందిన సొసైటీ మాజీ సీఈఓ పోశాల మొగిలి ఇటీవల అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందాడు. శోకసముద్రంలో బాధిత కుటుంబ సభ్యులను, భూపాలపల్లి ఎమెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

మండలంలోని కొరికిషాల మోడల్ స్కూల్ లో 6వ తరగతి నుండి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు(MPC,BPC,CEC) ఖాళీ ఉన్న మిగిలిన సీట్ల భర్తీకి ఆఫ్ లైన్(ప్రత్యక్ష) విధానంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్ అందించబడుతాయని, దూర ప్రాంత విద్యార్థులకు అన్ని రూట్ల నుండి ఉచిత బస్సు సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ హైమావతి కోరారు.

ప్రమాదకరంగా....

కొండాయి వాగుపై తాత్కాలిక రోడ్డు





- శంకుస్థాపనతోనే ఆగిపోయిన బ్రిడ్జి పనులు
- వరదలకు ఆయా గ్రామాలతో
- మళ్లీ తెగిపోనున్న సంబంధాలు
- గిరిజనులకు మళ్లీ మొదలైన కష్టాలు

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ఏటూర్‌నాగారం మండలంలోని కొండాయి మల్యాల జంపన్న వాగుపై నిర్మిం చిన తాత్కాలిక రోడ్డు నిర్మాణం ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన చిన్నపాటి వరదలకు ప్రమాదకరంగా మారి కొన్ని చోట్ల కొట్టుకపోయింది. ఇకనుండి వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రోడ్డు నిర్మాణం పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దాంతో ఆ గ్రామాల గిరిజనుల కష్టాలు మళ్ళీ మొదటికి రాను న్నాయి.

2023 నవంబర్ నెలలో ప్రజలు మేడారం జాతరకు తరలి వెళ్లడానికి కొండాయి జంపన్నవాగుపై 20 లక్షల రూపాయల నిధులతో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు నిర్మాణం జరిగింది. కొన్ని నెలలపాటు గ్రామాల ప్రజలకు రహదారిగా ఉన్న రోడ్డు ప్రస్తుతం వాగులో వస్తున్న వరదలకు రోడ్డు తెగిపోయి ప్రమాదకరంగా మారింది. కొండాయి మల్యాల ఐలాపూర్ ప్రాంతాల గిరిజనులు మళ్లీ తలలు పట్టుకుంటున్నారు. మళ్లీ కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా సంవత్సరాల తరబడి ఆయా గ్రామాల గిరిజనులు ప్రజలు వరదలు వచ్చిన సమయంలో జంపన్న వాగులో తాళ్లు పట్టుకొని ప్రాణాలు చేతులు పెట్టుకొని సంవత్సరాల తరబడి వాగు దాటిన సంఘటనలు ఉన్నాయి. అనేకమార్లు గిరిజనులు ఐటీడీఏ పిఓలకు మొరపెట్టుకోవడంతో అప్పటికి ఐటీడీఏ పిఓ ఇంజనీరింగ్ శాఖ నుండి 6 కోట్ల రూపాయల నిధులను కొండాయి జంపన్న వాగు పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి నిధులు కేటాయించారు. నిర్మించిన రెండు సంవత్సరాలకే ఒకపక్క వరదలకు బ్రిడ్జి కృంగిపోయింది. మరో రెండు సంవత్సరాల తర్వాత వచ్చిన భారీ వరదలకు ఏకంగా బ్రిడ్జి నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. అనంతరం ఆ గ్రామాలకు రహదారి లేకపోవడంతో ఆర్ అండ్ బి శాఖ ద్వారా తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. కొన్ని నెలల వరకు రహదారి గ్రామాలకు ఉపయోగపడినప్పటికీ ఇటీవల వచ్చిన తాత్కాలిక వర్షాలు వరదలకు కొట్టుకపోతోంది. దాంతో గిరిజనులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు .

శంకుస్థాపనకే పరిమితమైన బ్రిడ్జి పనులు

కొండాయి బ్రిడ్జిపై మళ్ళీ శాశ్వత వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నుండి 13 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న సీతక్క బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీలైనంత త్వరలో పనులు చేపట్టి గిరిజనులకు శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా బ్రిడ్జి పనులకు ఇంకా టెండర్లు పూర్తిగాకపోవడంతో ఇప్పటికి కూడా వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. ఒక శంకుస్థాపన శిలాఫలకం తప్ప పనులు కనిపించడం లేదు. ఇక ఈ సంవత్సరం గిరిజనులకు మళ్లీ కష్టాలు తప్పడం లేదు. ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం





చేస్తున్నారు. ఈసారి వర్షాలకు మళ్ళీ వరదలు పోటెత్తితే మా పరిస్థితి ఏమిటని మా జీవితాల పరిస్థితి ఎలా ఉంటుందోనని గిరిజనులు ఆలోచనలు పడ్డారు . మంత్రి సీతక్క చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా మొదలుపెట్టేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇంటింటా 'భగీరథ' సర్వే

-నల్లా కనెక్షన్ల సఖ్య సేకరణ - ప్రత్యేక యాప్ లో నమోదు -కొనసాగుతున్న ప్రక్రియ



నవతెలంగాణ-మల్హర్‌రావు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరు తెన్నులపై ప్రభుత్వం ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇవ్వడమే లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో ప్రారబించిన మిషన్ భగీరథ పథకం పనితీరును తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. వారు తమ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి భగీరథ పథకం, నల్లా కనెక్షన్ వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం నుంచి మండలంలో సర్వే ప్రారంబించారు. దీనిపై ఇదివరకే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.చిన్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పెద్ద గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతోపాటు అంగన్ వాడి టీచర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంటింటా సర్వేలు చేస్తున్నారు.

తాగునీటి సర్వే కోసం ప్రత్యేకంగా ఒక యాప్ ను రూపొందించారు. పంచాయతీ కార్యదర్శులు ఈ యాప్ లోనే నల్లా కనెక్షన్ వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శికి ఐడి, పాస్ వార్డ్ కేటాయించారు.గ్రామంలో ఎన్ని నివాసీత ప్రాంతాలు (హ్యాబిటేషన్లు) ఉన్నాయి. ఇందులో ఎన్ని ఇల్లు ఉన్నాయి ఎన్ని ఇళ్లకు మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా కొత్తగా కనెక్షన్లు ఇవ్వాల్సిన ఇండ్లు ఏమైనా ఉన్నాయా.. ఉన్న కనెక్షన్ల ద్వారా ఇంటి అవసరాలకు సరిపడా నీరు సరఫరా అవుతోందా అనే వివరాలు నమోదు చేయాలని నిర్ణయించారు. ఇంటి ఫొటోతోపాటు, నల్లా కనెక్షన్ ఫొటోలను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక నల్లా కనెక్షన్ ఉన్న ఇంట్లో ఎన్ని కుటుంబాలు నివాసిస్తున్నాయి.ఆ కుటుంబాల్లోని సభ్యుల సంఖ్య తదితర వివరాలు నమోదు చేస్తారు. ఎంత సమయం నల్లా వస్తుంది.నీటి సరఫరా పెంచాల్సిన అవసరం తదితర అంశాలను సర్వేలో పరిశీలిస్తున్నారు.

మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ.....

తాగునీటి నల్లా కనెక్షన్లకు సంబంధించిన ఎంపిడిఓలు ,ఎంపిఓలు,,ఇరిగేషన్ అధికారులు ఈ నెల 3న హైదరాబాద్ లో శిక్షణ పొందారు.వీరు జిల్లాలోని అన్ని మండలాల్లోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, అంగన్ వాడి టీచర్లకు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. సోమవారం నుంచి మండలంలో శిక్షణ ప్రారంభమైంది.10 రోజుల్లో ఈ సర్వేను పూర్తి చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు.

గడువులోపు సర్వే అయ్యేనా ?

మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలు, 22 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా సర్వే చేయాల్సిన ఇండ్లు 15,678 ఉండగా బుధవారం నాటికి 9,236 ఇండ్లు పూర్తి అయ్యాయి.ఇంకా 4567 ఇండ్లు సర్వే చేయాల్సి ఉంది.నూతనంగా సర్వేలో చేర్పించిన ఇండ్లు 678 ఉన్నాయి.మండల వ్యాప్తంగా 60 శాతం పూర్తి అయింది.ఇంకా 45 శాతం కావాల్సి ఉంది. అయితే ఈ నెల 20 లోపు సర్వే పూర్తి కావాల్సి ఉంది.తుది గడువులోపు అయ్యేనా అనే సందేహాలు వినిపిస్తున్నాయి.

వివరాలు ఉన్నతాధికారులు అందజేస్తాం

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో మిషన్ భగీరథ కనెక్షన్లపై ఇంటింటా సర్వే సోమవారం నుంచి ప్రారంభించాం.ప్రతి రోజు 20 నుంచి 25 ఇళ్లలో సర్వే నిర్వహించి యాప్ లో పొందపర్చాలని పంచాయతీ కార్యదర్శులకు అదేశాలిచాం. మిషన్ భగీరథ తీరు తెన్నెలపై ప్రతి అంశాన్ని సర్వేలో సేకరిస్తున్నాం. సేకరించిన వివరాలను గడువులోపు ఉన్నతాధికారులకు అందజేస్తాం.

విక్రమ్ కుమార్, ఎంపీఓ



సమస్యలు పరిష్కరించాలి : ఎస్టీయు

నవతెలంగాణ - ములుగు

మోడల్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ మధుసూదన్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి సీతక్కకు విన్నవించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కుంటున్న సమస్యలు అయిన బదిలీల కు సంబంధించి కోర్టు కేసులను ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలను 010 పద్దు కింద ఇప్పించాలని కోరారు. బదిలీల తో పాటు పదోన్నతులు కూడా నిర్వహించాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, విద్యార్థి సంఖ్య ఎక్కువగా ఉన్న చోట అదనపు టీజీటీ పోస్టు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు రుద్రమ దేవి, కృష్ణ ,రమేష్, మంజుల, అపర్ణ, అనీఫ్, సుధారాణి, శ్రీనివాస చారి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-రేగొండ

నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేగొండ గోరుకొత్తపల్లి మండలాలకు చెందిన 49 మంది లబ్దిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చె క్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స త్యనారాయణరావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభు త్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలే బొంద పెట్టారని అన్నారు. అప్పులు తీర్చుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన చేపడుతుందని అన్నారు. ఎన్ని కల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తామని అన్నారు. ఎ లాంటి పైరవీలు మధ్యవర్తులు ప్రమేయం లేకుండా సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూస్తానని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో



ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, పిఎసిఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్ రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తాసిల్దార్లు సత్యనారాయణ స్వామి, వీరభద్రమ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి రవీందర్రావు, ఎంపీ టీసీలు సూర స్వాతి సుధాకర్, ఐలి శ్రీధర్ గౌడ్, ఎస్ ఎస్ ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పుల్లూరి బాబురావు, పత్తి ప్రభాకర్, మేకల బిక్షపతి, మొట్టె కిరణ్ పటేల్, బొట్ల రవి సామ్రాట్, వీరబ్రహ్మం, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తా.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కు మడతపల్లి ఎంపిటిసి సూర స్వాతి సుధాకర్ 20 కుర్చీలు ప్రదానం చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే హాజరై నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే నిధులు కేటాయించి భూమి పూజ చేయిస్తానని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటేష్, ఉపాధ్యక్షులు బండి కమలాకర్, సంయుక్త కార్యదర్శి అంబాల రవీందర్, గౌరవ అధ్యక్షులు నామాల రమేష్, పిఎసిఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్ రావు, ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి రవీందర్రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మోడెమ్ ఉమేష్ గౌడ్, పుల్లూరు బాబురావు, పత్తి ప్రభాకర్, ఎంపిటిసి శ్రీధర్ గౌడ్, నాయకులు మేకల బిక్షపతి, బ్రహ్మం, బండారి దేవేందర్, వెంకట్రావు తది తరులు పాల్గొన్నారు.





కొట్టే సతీష్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ - మహాదేవపూర్

కాటారం మండలం గారేపెల్లికి చెందిన కొట్టే సతీష్ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి తన గ్రామంలో బిజినెస్ స్థాపించి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాడు. అలాగే స్వయంకృషి స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నాడు. ఈ సంస్థ ద్వారా కరోనా కాలం లో మరణించిన వారికీ అంతక్రియలు నిర్వహించడం, గ్రామంలో పేదవారు ఎవరైనా చనిపోతే వారికి సహాయం చేయడం, పేద పిల్లలు చదువుకోవడంలో సహాయం అందించడం, పదో తరగతి పిల్లలకు ఫైనల్ ఎగ్జామ్స్ సమయంలో పెన్నులు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఫలితాలు సాధించిన అమ్మాయిలకు నగదు పురస్కారం అందజేశారు. ఇలా స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలోని బహుజన సాహిత్య అకాడమీ వారు 2024 సంవత్సరానికి జాతీయ సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. గురువారం అవార్డు గ్రహీత కొట్టే సతీష్‌ను కాటారం వాసులు ఘనంగా సన్మానించారు. అవార్డు రావడంతో బాధ్యత పెరిగిందని రాబోయే కాలంలో కాటారం మండలంలో మరిన్ని సేవలు చేయడానికి ముందు ఉంటామని కొట్టే సతీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కడారి విక్రమ్, సింగిరెడ్డి మధుకర్ రెడ్డి, ఆత్మకూరి కుమార్, సీఆర్పీఎఫ్ జవాన్ మనోహర్, సుమన్, కష్టారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.